# ప్రపత్తి శ్రీసన్నిధానం

ఆధ్యాత్మిక మాసపత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 10 డిసెంబర్ 2024 పేజీలు: 36 వెల: 30/-



అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఆధ్యాత్మిక పత్రిక



# ముఖచిత్రపరిచయం

మానవ జీవితం చరితార్థం చేసుకునే మార్గం గోదాదేవి ఆవిష్కరింపజేసింది. ఇందుకోసం గోపికలు ఆచరించిన వ్రతం ఇది అంటూ ప్రేమామృతాన్ని కురిపించింది. శ్రీకృష్ణ ప్రాప్తి గోపికలకే కాదు కలియుగంలో సైతం సుసాధ్యం, ప్రేమించడమే పరమ పురుషార్థమని ఆండాళ్ తల్లి మనకు చెప్పింది. సర్వవేద సారమైన 'తిరుప్పావై' గీత మాలికను అందిస్తూ ముప్పది రోజుల పాటు ఆచరించి, మనతో ఆచరింపజేసి, భక్తిమార్గంలో శరణాగతి చేసిన వారికి ముక్తి లభిస్తుందని తెలియజేసింది. శ్రీకృష్ణ (భగవంతుని) సేవ లోక కళ్యాణం కోసమేనని చెప్పింది. అంతాకృష్ణలీల! గోపికల ఆరాధనా భావంలో ఎన్నో అద్భుతాలు నిక్షిప్తం చేయబడ్డాయి. పక్షులకిలకిలా రావాలు, ప్రకృతి మాత పులకించడం వర్షం కురవడం ఇత్యాది ఎన్నో అంశాలు కావ్యంలో చూపించింది. కనులు మూసుకుంటే అవన్నీ దృశ్యకావ్యంగా కనిపిస్తాయి. అలాగే భగవద్రామానుజుల వారు కూడా ఆ పరమార్థాన్ని దర్శించి పరవశించారు. విజయనగర పాలకులు శ్రీకృష్ణదేవరాయల వారు కూడా దర్శించి ఆముక్తమాల్యద గ్రంథంగా రచించారు. ప్రపత్తి శ్రీసన్నిధానం పాఠకులకోసం 'శరణాగతి భక్తి మార్గానికి ఇది సోపానం' అంటూ కృష్ణతత్వాన్ని ముఖచిత్రంగా ఆవిష్కరించారు.

# గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు సలహాలు, సూచనలు, చందాదారుల చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి ఇ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:

prapatti.srisannidhanam9@gmail.com

మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్:

9502583323

(ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)

yono SBI | SBI Payments

MERCHANT NAME: SRI SANNIDHANAM CHARITABLE TR

UPI ID: 9502583323@SBI

SCAN & PAY

BHIM SBI Pay BHIM UPI

**సంప్రదించండి**

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**

**-ఎడిటర్**

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

**- ఎడిటర్**

# ప్రపత్తి శ్రీసన్నిధానం

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 1 - సంచిక: 10 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి డిసెంబర్ 2024 వెల : 30


ఇందులో


4. సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి

6. శ్రీరామానుజ సుధామాధురి
శ్రీమతి సముద్రాల శారద

8. అందరి గురువులు అభినవ వ్యాసులు

10. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య, సిద్ధాంతి

12. దాశరథి శతకము
శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు

14. భాగవతంలో భగవంతుని అవతారగాథలు
శ్రీమతి తిరుమల నీరజ

16. వేదవాక్కు
శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు

17. గీతామృతం
శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య

18. ధనుర్మాస వైశిష్ట్యము (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి

20. జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

21. భగవదాలయములు - నియమనిబంధనలు
శ్రీమాన్ శ్రీ తిరువరంగం దాస శేషాచార్యులు

22. క్షత్ర బంధుడు
శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు

23. సంస్కృత సాహిత్యంలో ఆణిముత్యాలు
శ్రీమాన్ శ్రీ కె.కోదండరామాచార్యులు

25. శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి

27. జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?
శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు

28. శ్రీసంప్రదాయ సేవలో

30. ఋషివాక్య ప్రబోధాలు
శ్రీమాన్ శ్రీ డా.యం.టి. ఆళ్వార్ స్వామి.

31. తెలుసుకోవలసినవి మూడే
శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు

నెలవారిపంచాంగం, మనదేవాలయాలు, పుస్తక పరిచయం, బాలవిజ్ఞానం, శ్రీసన్నిధిపదకేళి



## సంపాదక మండలి

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

## గౌరవ సంపాదకులు

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

## సంపాదకీయం

# అమృతమయమయిన గో ఉత్పత్తులపై 'పేటెంట్' సాధించాలి



ఆవును గోమాతగా పిలుచుకుంటున్న మనం దానిని రక్షించుకునే దశగా, దిశగా ఏం చేస్తున్నమన్నది ప్రశ్న? ఆవు నుంచి ఉత్పత్తి అవుతున్న పంచగవ్యాలు మనకు చేస్తున్న మేలు ఎందరికి తెలుసు? హోమం, హవనాలు, విశిష్ట పూజల సమయంలో పంచగవ్యాలను ఉపయోగిస్తున్న సందర్భాలు గమనిస్తున్నాం. గో మయం ఆవు పేడ, గో మూత్రం, గో క్షీరం ఆవు పాలు, గో దధి ఆవు పెరుగు, గో ఘృతం ఆవు నెయ్యి వీటన్నింటిని కలిపి పంచగవ్యాలు అంటారు, ఈ పంచగవ్యాలను వివిధ సందర్భాలలో మన సంస్కృతి సంప్రదాయాలలో ఉపయోగించేలా ఋషులు మనకు మార్గదర్శకం చేశారు. "గో మయే వసతే లక్ష్మీ", ఆవు పేడలో లక్ష్మీదేవి నివసిస్తుందని శాస్త్ర ప్రవచనం. ఆవు పాలు గంగానదితో సమానమని పురాణ ప్రవచనం. ఇక్కడ మనం ఒక విషయం గమనించాల్సి ఉంది. ఆవు పేడతో కళ్లాపి జల్లుతాం కాని మరో జంతువు మలంతో కళ్ళాపి జల్లం కదా? ఆవు పేడలో హానికారకమైన క్రిములను హరించే గుణ ముందని పరిశోధకులు చెప్పేవరకు మనకు తెలియదు. కానీ మన పూర్వీకులు వాటి విలువ తెలిసి ఎక్కడ ఉపయోగించాలో తెలియ జెప్పారు. ఆచరించి ఇలా నడుచుకోండి! అన్నారు. అంటే సైన్స్ పరంగా చూసినా ఆవుపేడతో ఇంటిముందు కళ్లాపి జల్లి ముగ్గుపెట్టుకోవడం మంచిదన్న మాట. సూర్య కిరణం నుంచి అద్భుత శక్తులను ఆవు మూపురం ద్వారా గ్రహించి క్షీరములను (పాలను) అమృతంగా మారుస్తుందన్నది ఋషులు చెప్పిన మాట! అందుకే గో అన్నపదానికి కిరణం అని చెప్పుకున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన కొన్ని దేశాలవారు మూపురం ఉన్న దేశవాళీ గోవులను దిగుమతి చేసుకుని వాటి సంతతిని అభివృద్ధి చేస్తున్నారు. ఎంగిలి అంటనివి రెండే రెండు అవి ఆవుపాలు, ఆత్మ అని చెపుతారు. అందుకే పాలకు అంత ప్రాశస్త్యం ఉంది. అందుకనే శ్రీకృష్ణ భగవానుడు చెప్పినట్లు భూమి ఉద్ధరింపబడే ఏడుగురిలో ప్రథమ స్థానం గోవుకే ఇచ్చాడు. అంతే కాకుండా గోవులలో కామధేనువులా తాను వసిస్తానని భగవద్గీత పదవ అధ్యాయం 20 శ్లోకంలో స్పష్టం చేశారు. వీటన్నిటి ఆధారంగా ఆయుర్వేదం వైద్యంలో పంచగవ్యాలను వివిధ సందర్భాలలో ఉపయోగిస్తూ సత్ఫలితాలు సాధించిన సందర్భాలు ఉన్నాయి. ఇవన్నీ పసిగట్టిన మెకాలే బ్రిటిష్ పాలన సమయంలో భారత సనాతన సంస్కృతిని కాలరాసే యత్నంగా 1913లో కలకత్తాలో గో కబేళాను ఆరంభించాడు. ఇప్పుడది దిన దిన ప్రవర్థమానంగా అన్ని రాష్ట్రాలకు వందల సంఖ్యలో విస్తరించాయన్నది వాస్తవం. ప్రపంచానికి మంచి చెప్పాలన్న ప్రయత్నంలో భారత సనాతన సంప్రదాయాలపై ఎదురు దాడి చేస్తూ పంచగవ్యాలను వైద్యంలో ఉపయోగించే దిశగా ఒక్కొక్కటీ పేటెంట్ (విశిష్టాధికారం) తీసుకునే ప్రయత్నంలో విదేశాలు తల మునకలు అవుతున్నాయి. చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలో చైనా, అమెరికాలు ముందున్నాయి. గోమూత్రంపై పేటెంట్ తీసుకునే యత్నం చేసాయన్నది వాస్తవం. ఒక అడుగు ముందుకు వేసిన అమెరికా క్యాన్సర్ రోగ క్రిముల ఎదుగుదలను గో మూత్రములోని పదార్థాలు అరికడతాయని ప్రకటించాయి. పేటెంట్‌లు తీసుకున్నాయి. కానీ మన సనాతన గ్రంథాలు ఈ విషయం ఎప్పుడో చెప్పాయి. ఆవు నెయ్యిని పుటం పెట్టి కంటివైద్యానికి ఇతర నాడులు చైతన్యవంతంగా పనిచేయడానికి ఉపయోగిస్తారనేది వాస్తవం. సంవత్సరాలపాటు నిలువ చేసిన ఆవు నెయ్యి అమృతమైతే, అగ్నిలో వేసిన ఆవునెయ్యి ఆక్సీజన్ అవుతున్నది. ఇది పలుమార్లు శాస్త్రపరంగా రుజువు అయిన సందర్భాలు ఉన్నాయి. మానసిక రోగులకు నెయ్యి మానసికంగా ఎదగడానికి కూడా ఉపయోగపడుతుందన్న దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి. సత్ ఫలితాలు కనిపిస్తున్నాయి. ఆవు పాలు చిన్న పిల్లలకు, రోగులకు మంచిదన్నది ఆచరణలో ఉన్నదే, వైద్యపరంగా ముందడుగు ఏమిటంటే ఎలర్జిక్ కంజెక్టివిటీస్ నిరోధానికి దోహదం చేస్తుందన్న దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఆవు మూత్రంతో చికిత్స ద్వారా క్యాన్సర్ రోగులకు చికిత్స చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని మంద్‌సోర్ జిల్లాలో ఇలాచికిత్స చేస్తున్నారు. దీనిపై సమగ్ర పరిశోధన జరుగుతోంది. వాస్తవాలు మన కనుల ముందు సాక్షాత్కారం అవుతున్నా, సాంకేతికంగా హక్కులు పొందే విషయం ప్రభుత్వం ఆలోచించాలి, మేధావులు, ఆర్థికంగా చేయూత నిచ్చేవారు ఈవిషయంలో ముందు నిలువాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-రొద్దవర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

మార్గశిర మాసం 02-12-24 శుక్లపక్షంతో ప్రారంభమై 30-12-24 వరకు, 31-12-24 నుండి పుష్యమాసం

01-12-2024 వరకు అనూరాధ కార్తి, 02-12-2024 నుండి జేష్ఠ కార్తి 16-12-2024 నుండి మూల కార్తి,

పండుగలు :07-12-24 సుబ్రమణ్య షష్ఠి, 11-12-24 సర్వేషాం ఏకాదశి, గీతా జయంతి, 14-12-24 దత్తాత్రేయ జయంతి, 16-12-24 ధనుర్మాసారంభం ఉదయం 6-44, 18-12-24 సంకష్టహర చతుర్థి 26-12-24 సర్వేషాం ఏకాదశి, 29-12-24 మసశివరాత్రి, 30-12-24 అమావాస్య శ్రీరమణమహర్షి జయంతి.

## మాస ఫలాలు



**మేషం:** ఈ నెల అన్నిరంగముల వారికి చేయు వృత్తి వ్యాపారాలు కలిసివచ్చును. ఆర్థికంగా బలపడుదురు. ధైర్యంతో ముందుకు పోగలరు.



**వృషభం:** ఈ నెల కొంతమేర నష్టం కలిగించును. ఆరోగ్యరీత్యా కూడా ఇబ్బందులు. పనులందు అలసట, కొన్నిపనులు మధ్యలో నిలచిపోవుట.



**మిథునం:** ఈనెలలో స్వల్పంగా ఇబ్బందులు. జాగ్రత్త అవసరం. స్థానమార్పులు, గృహ మార్పులు. ఉద్యోగుల ఆకస్మిక బదిలీలు. ద్వితీయార్థంలో కొంత బాగుండును.



**కర్కాటకం:** ఈనెలలో అన్నిరంగాల వారికి బాగుంటుంది. వ్యాపారాలు అనుకూలించును. వ్యవహార జయం. ఆరోగ్యలాభం, ధనమునకు లోటుండదు. ఉత్సాహం. హుషారుగా ఉంటారు.



**సింహం:** ఈ నెలలో శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది. ఒక్కోసారి మీ మాటలు ఉద్రేకంగా ఉండుటచే కార్యములందు ఆటంకములు. ఆర్థిక ఇబ్బందులు ఊహించని సమస్యలు.



**కన్య:** ఈనెలలో అన్నిరంగాల వారికి యోగమే. చేయువృత్తి వ్యాపారాలు లాభించును. ఆరోగ్యం బాగుంటుంది. ఆదాయానికి లోటుండదు.



**తుల:** ఈ నెల మీ శక్తి సామర్థ్యములు రుజువు చేసుకుంటారు. స్వంత తెలివి తేటల వల్ల అందరినీ ఆకర్షించెదరు. నూతన వ్యవహారలాభం, ఆదాయంవృద్ధి,



**వృశ్చికం:** ఈ నెలలో అనుకూలంగా ఉన్నందువల్ల చేయువృత్తి వ్యాపారాలు బాగుండును. ఆరోగ్యం బాగుండును. ఆర్థికంగా నిలద్రొక్కుకుంటారు.



**ధనుస్సు:** ఈ నెల అందరికీ బాగుండును. వృత్తి వ్యాపారాలందు రాణింపు. ఆర్థిక లావాదేవీలు సంతృప్తి, సమస్యలు తీరును ఆరోగ్యం బాగుండును.



**మకరం:** ఈనెలలోస్వల్పంగా ఇబ్బందులు. వాహననష్టం, ప్రమాదాలు, ధనం మంచి నీళ్ళ వలె ఖర్చుగును. ప్రతి చిన్న విషయానికి కోపోద్రేకులగుదురు.



**కుంభం:** ఈ నెలలో ప్రతీ చిన్న విషయానికి ఆందోళన చెందుదురు. కోపం ఎక్కువ. దురుసుగా ప్రవర్తిస్తారు. ఉద్రేకంగా మాటలాడుటచే మీమాటలను వక్రీకరిస్తారు. ఆరోగ్యభంగాలు.



**మీనం:** ఈ నెలలో గ్రహానుకూలం వల్ల చేయు వృత్తి వాపారాలకు అనుకూలం. వాహనసౌఖ్యం. సంతాన సుఖాలు, ఆరోగ్యం బాగుండును. ఎంతోకాలంగా ఉన్నసమస్యలు మబ్బు తొలగునట్లు తొలగిపోవును.

**దత్తాత్రేయుడు బ్రహ్మ, విష్ణువు మరియు శివుని ఒకే రూపంలో ఉన్న అవతారం. సృష్టించడం, సంరక్షించడం మరియు నాశనం చేయడం. ఈ మూడు తలలుగా ఉండటం సృజనాత్మకమైనది. మార్గశీర్ష మాసం పూర్ణిమ నాడు దత్తాత్రేయ జయంతి జరుపుకుంటారు. ఈ రోజు తెల్లవారు ఝామునే నదీస్నానం చేస్తారు. షోడశోపచారాలతో పూజ, జప ధ్యానాలకు ఈ రోజు ప్రాముఖ్యం ఇస్తారు.**

### మంచి రోజులివిగో...

ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు

4,5,6,11,15,18,20,25,26

# శ్రీరామానుజ సుధామాధురి

## సేవయే వరం, నిష్ఠయే సారం



– శ్రీమతి సముద్రాల శారద

యమ నియమాది యోగముల వంటి కఠిన సాధనల ద్వారా సిద్ధించని (ముక్తి మార్గము) లేదా మానసిక శుద్ధి కేవల శరణాగతి ప్రపత్తి ద్వారానే సిద్ధిస్తుందనే సత్యము తెలిపిన వారు మన ఆళ్వారాచార్యులు. వేదమార్గ ప్రతిష్ఠాపనం చేసి వారు చూపించిన ఆచరణ మార్గం సూత్ర బద్ధం చేసి సమాజానికి ఉపదేశించి ఆ కర్తవ్య విధినే వారు జీవన విధానంగా ఏర్పర్చుకున్నారు ఆచార్యులు. అందుకే అటువంటి మహనీయుల నడవడిలో మనకా ధర్మసూక్ష్మాలు బోధ పడుతాయనుటలో సందేహం లేదు!

యమమంటేనే అహింస, సత్యము, అస్తేయము (ఈర్ష్యలేకుండుట) బ్రహ్మచర్యము, అపరిగ్రహము (కూడనిది గ్రహించ కుండుట) వీటిని సాధన చేస్తే చిత్తశుద్ధి కల్గుతుంది. అలాగే రెండవది నియమము: అనగా శౌచము, సంతోషము, తపము స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానం (భగవదారాధనము) మొదలగునవి నియమము. ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, (ఇంద్రియాలను ఉపసంహరించు కొనుట) ధారణ, జ్ఞానము, సమాధి ఇటువంటి ఎనిమిది అంగాలు గలిగినది యోగమార్గము. ఇంతటి నియమాలను సాధించి భక్తిశరణాగతి మార్గంలోనే భగవత్‌తత్వాన్ని తామను భవించినవారు ఆళ్వారులు. వానిని ఆచరించి వారి వాఙ్మయము ద్వారా సంస్కృతి సంప్రదాయాల ద్వారా మనకందించిన వారు ఆచార్యులు.

“ఔషధ గుణాలు ఎరిగిన శ్రేయోభిలాషి అయిన వైద్యుడు ఉండగా రోగికి (ఆరోగ్యం కోరుకునే వారికి) దాని గుణదోష పరిశీలన అవసరం లేదు. ఆ పరిజ్ఞానం కూడా ఉండదు. అలాగే ఉజ్జీవించ తలచిన ప్రతి ఒక్కరికి సంప్రదాయాలపై విశ్వాసం ఆచార్యుల యెడ భక్తి అవశ్యం (తప్పక) ఉండాలి. అందుకే ఎంతటి విద్యావంతులయినా, పదవీ ధన సంపన్నులైనా పరమార్థం తెలుసుకొని ఉజ్జీవింప తలచిన వారు తత్వ దర్శనం చేసిన ఆచార్యులను ఆశ్రయించ వలసినదే!

ఆ క్రమంగానే మహా విద్వాంసుడైన యజ్ఞమూర్తి, జ్ఞాన తేజోమూర్తి అయిన భగవద్ రామానుజుల ముఖవర్చస్సు లోనే భగవత్ దర్శనం చేసి వారికి శిష్యులై (వారి నామాన్నే) అరుళాళపెరుమాళ్ ఎంబెరుమానార్ నామాన్ని స్వీకరించారు.

అది వరకే సన్యాసాశ్రమములో ఏకదండంతో ఉన్న వారు. శ్రీవైష్ణవ యతి సంప్రదాయంలోని త్రిదండాన్ని స్వీకరించారు. భక్తితో భగవద్రామానుజుల శిష్యులుగా మారారు “ముత్యపు చిప్పలో పడితేనే స్వాతి చినుకు ముత్యంగా మారినట్టు” వారు ఉభయ వేదాంత ప్రవర్తకులైన భగవద్రామానుజులకు శిష్యరత్నంగా మారారు. యతి రాజులు కూడా

**యామునాచార్య సుధాంబోధి మవగాహ్య యథామతిః।**
**ఆదాయ భక్తి యోగస్య రత్నం సందర్శయామ్యహం।।**

అనగా తన ఆచార్యులైన యామునాచార్య సూక్తి సుధాంబుధిలో తాను అవగాహన (మునిగి) పొంది, తదనుసారంగా భక్తియోగ రత్నాన్ని చూపిస్తున్నాను.” అని తమ ఆచార్య మార్గాన్నే అనుసరించారు. అంతటి ఆచార్యులకు శిష్యులైన దేవ రాజముని సౌశీల్యం, గురుభక్తి శ్లాఘనీయం! అంతటి విద్వాంసులైన దేవరాజమునులు ఆచార్యులైన భగవద్రామానుజుల సేవే గొప్ప వరంగా భావించారు. ఆచార్య నిష్ఠయే ముక్తి హేతువుగా, జ్ఞానసారంగా భావించారు.

వైష్ణవులైన వారికి ప్రధానమైనది పంచ సంస్కారము (చక్రాంకితాలు అగుట)

**ప్రధానం తాప సంస్కారో వైష్ణవస్య మునీరితః।**
**సర్వాశ్రమేషు వసతాం స్త్రీణాం చ ద్విజ సత్తమః।।**

# శ్రీరామానుజ సుధామాధురి



అని అన్ని ఆశ్రమాల్లో ఉన్నవారికి (వయసుల్లో ఉన్నవారికి) స్త్రీలకు కూడా వైష్ణవత్వానికి ప్రధానమైనది తాప సంస్కారం. అనగా చక్రాంకితాలు కావటం. కనుక వారికి చక్రాంకితాలు గావించి శిష్యులుగా స్వీకరించారు.

**"సర్వం ద్రావిడామ్నాయం యావత్ తత్వార్థ సంపదం"**అని ద్రావిడ వేద సర్వ ప్రబంధాలను, తత్వార్థాలను యతిరాజుల ద్వారా దేవరాజమునులు నేర్చుకున్నారు.


భగవద్రామానుజులు వారి జ్ఞాన పారంగత్వానికి తగినట్లుగా తన మఠానికి ఎదురుగా వారికి గొప్ప నివాసాన్ని ఏర్పాటు చేసి కొందరు శిష్యులను కూర్చారు. వారిలో తిరుమలలో పుష్ప కైంకర్యం చేసిన అనంతార్యులు కూడా ఉన్నారు. శిష్యులుగా చేరడానికి ఇతర ప్రాంతాల నుండి వచ్చిన యజ్ఞేశులు, పూర్ణార్యులు, పూర్ణులు, అనంతార్యులు మొదలగు వారిని దేవరాజమునులకు శిష్యులుగా ఏర్పాటు చేశారు. వారి మఠవైభవాన్ని చూసి ఎంబెరుమానార్ (అరుళాల పెరుమాళ్ ఎంబిరుమానార్ అని పూర్తి పేరు) అనే నామాన్ని కూడా చూసి కొందరు ఇతర ప్రాంతాల నుండి వచ్చి వీరే యతిరాజులని పొరపడేవారట!.

ఒకసారి అలాగే జరిగినప్పుడు దేవరాజమునులు ఎంతో అపచారంగా భావించి **"గ్రామ టిట్టిభ కంఠాగ్రే బద్ధ తాళ ఫలం యథా"** అని గ్రామ పిచ్చుక మెడలో తాటి పండు కట్టినట్టు నన్ను ఇటువంటి శిష్యులకు ఆచార్యునిగా చేశారు. అంటూ తన ఆకించన్యాన్ని వెలువరించిన వైష్ణవాగ్రేసరులు వారు. తాను బోధించే శిష్యులందరికీ కూడా భగవద్రామానుజులే ఆచార్యులని ప్రకటించారు.

**"జానీధ్వమ్ లక్ష్మణార్యస్య పాదమేవ హి రక్షకం"** అందరికీ భగవద్రామానుజుల పాదమే రక్షకము అని తెలిపారు. "చరమ పర్వనిష్ఠ" అని ఆచార్యనిష్ఠను కలిగి ఉండడం, సంప్రదాయంలో ప్రధాన అంశంగా భావించబడుతున్నది. భగవత్ రామానుజుల పూర్వ ఆచార్యులలోనూ తదనంతర ఆచార్యులలోనూ పరమ ఆచార్యులుగా నాయకమణిగా యతి రాజులైన భగవద్రామానుజులే భావింపబడుతున్నారు. ఈ కాలమందు కూడా శ్రీసాంప్రదాయ బోధనలు, ఉపదేశములు ఏ ఆచార్యుల వద్ద స్వీకరించినప్పటికీ వారందరికీ కూడా భగవద్రామానుజాచార్యులే ఆచార్యులుగా భావింపబడతారు. నేటికి సంప్రదాయంలో యతులందరూ రామానుజనామం తోనే భాసిల్లుతున్నారు.

తదనంతర కాలంలో అపర రామానుజుల అవతారంగా భావించే మనవాళ మామునులు శ్రీరామానుజ సిద్ధాంతాన్ని తమ బోధనలతో వాఙ్మయంతో సంపన్నవంతం చేశారు. వారు కూడా "అంతిమోపాయనిష్ఠ"గా ఆచార్య నిష్ఠనే ప్రధానమని ఉభయ విభూతులలో (ఈ లోక పరలోక) శుభాన్ని ప్రసాదించగలవారు భగవద్రామానుజులే అని ప్రతిపాదించారు.

ఒక రోజు "ఎంబెరుమానార్ల (మన్నాథుల) మఠం ఎక్కడ?" అని వేరే గ్రామం నుండి వచ్చిన కొందరు వైష్ణవులు అడగగా "ఏ ఎంబెరుమానార్లు?" అని అక్కడివారు ప్రశ్నించారు. వారు "ఇద్దరు ఎంబెరుమానార్లు ఉన్నారా అని ఆశ్చర్యపోయారు." ఈ విషయాన్ని గమనించిన దేవరాజమునులు కలత చెంది "నాకు ఈ మఠము వైభవము వద్దు. మీతో సమానంగా చూడబడుట అపచారమని" భగవత్ రామానుజులని వేడుకున్నారు.



# అందరికి గురువులు
# అభినవ వ్యాసులు



ఏ గొంతు వినపడితే గాంభీర్యత ఉట్టిపడుతుందో, ఏ కంఠధ్వని అశేష భక్తజన ధర్మసందేహాలను తీర్చి ఆనందం కలిగించిందో, ఏ నిలువెత్తు విగ్రహం "అభినవ వ్యాస" రూపమై నడయాడినదో, ఏ మహానుభావుని గ్రహ గణన సామర్థ్యాన్ని "జ్యోతిష బ్రహ్మజ్ఞాని" అనే బిరుదు వరించిందో, ఎన్ని వందల కలములు "జ్ఞాన సరస్వతి" హస్తభూషణ మైనవో, ఎన్ని వేల కాగితములు "ఆంధ్ర సుదర్శనాచార్య" కరకమలముల స్పర్శనొంది ఉద్గ్రంథములైనవో ఎవరి పాండిత్య ప్రకర్ష "ఆగమ కోవిద, వేదభూషణ, ఉపన్యాస శిరోమణి, ఉత్తమ ఉపాధ్యాయ" ఇత్యాది అనేక బిరుదములకు వన్నె తెచ్చినవో, ఎవరి ప్రవచన ఝరి భక్తజనమునకు ధారక, పోషక, భోగ్యములై "ప్రవచన వారధి" గా కొనియాడబడినదో, ఎవరి అనితర సాధ్యమైన కృషితో "శ్రీభాష్య – శ్రుతప్రకాశికా వ్యాఖ్యానము" మరియు "భగవద్విషయ" వ్యాఖ్యానములు ఆంధ్రానువాదమునొంది ప్రపన్నులనుండి సామాన్యుల వరకు అందరీతిలో ప్రకాశితమైనవో అట్టి మహాచార్యులు ఉభయ వేదాంత ప్రవీణ డాక్టర్ కందాడై రామానుజాచార్య స్వామి వారు 10.11.2024 ఆదివారం రోజున పాంచభౌతిక శరీరాన్ని విడిచి శ్రీవైకుంఠ కైంకర్య సామ్రాజ్యములో అడుగిడినారన్న సంగతి లోక విదితమే!

బహుముఖ ప్రజ్ఞాశాలి, సహృదయులు, బహు భాష్యములను అధ్యయనము, అధ్యాపనము చేసిన పండితులు వారు 15-07-1944 సూర్యాపేట దగ్గరలోని చీదెళ్ల లో శ్రీమతి, శ్రీమాన్ రాధా రుక్మిణమ్మ, రత్నమాచార్య దంపతులకు జన్మించారు. వారి మేనమామగారైన శ్రీమాన్ శింగరాచార్య స్వామి వారి చొరవతో హైదరాబాద్ వేదాంత వర్ధినీ సంస్కృత కళాశాలలో (అప్పట్లో సీతారాంబాగ్‌లో ఉండేది) విద్యను అభ్యసించి అట్టి కళాశాలను స్థాపించిన శ్రీపెరుంబుదూర్ వాసులైన శ్రీమాన్ కోయిల్ కందాడై శఠకోప రామానుజాచార్య స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రులై విద్య పూర్తి అయిన అనంతరం అదే కళాశాలలో ఉపాధ్యాయునిగా చేరి ఉన్నత పదవులను అలంకరించి పదవీవిరమణ చేసిన మహనీయులు. తిరుమల తిరుపతి దేవస్థానములో అనేక టి.వి చానళ్లలో, వార్తాపత్రికల్లో పలువిధములైన సంప్రదాయ, ధర్మ ప్రచారములు కావించి ధర్మ సందేహాల స్వామిగా లోకముచేత కొనియాడబడినారు. జీవితములో ఎన్నో ఒడిదుడుకులను, సవాళ్ళను, ఒత్తిడులను ఎదుర్కొన్నప్పటికీ భగవంతునిపై అచంచల విశ్వాసముతో, సంప్రదాయ అభిమానముతో మరియు ఆచార్య నిష్ఠతో ఎన్నో అమూల్యమైన గ్రంథములను లోకార్పణం కావించారు. ఎన్నో మార్లు వైభవోపేతముగా భాగవత సప్తాహములను, శ్రీరామాయణ నవాహములను కొన్ని వేలమంది భక్తులతో







నిర్వహించారు. తమ జీవితకాలంలో సుమారు ఒక వేయి సార్లు సంపూర్ణ శ్రీరామాయణ పారాయణమును మరియు ఆరువేల సార్లకు పైగా సుందరకాండ పారాయణ కావించిన పుణ్యమూర్తి. శ్రీరామాయణములో ప్రతి శ్లోకమునకు మన ఊహకు అందని అతి గంభీరమైన, లోతైన అర్థములను అవలీలగా కృపచేయగల ధారణా సామర్థ్యము కల సరస్వతీ స్వరూపులు! మహద్వైభవం కల మహాచార్యులు!

ఉభయ వేదాంత పండిత పరిషత్ స్థాపనలో ప్రధాన పాత్ర వహించి అధ్యక్షులుగా ఎందరినో సంప్రదాయ ప్రవచనకారులుగా తీర్చి దిద్దారు. జీయర్ స్వాముల మరియు ప్రముఖ పండితుల అభిమానాన్ని చూరగొన్నారు. ఆన్లైన్ లో కూడా ఆసక్తి పరులకు ఉభయ వేదాంత గ్రంథ కాలక్షేపాలు చేశారు. వయసు, అస్వస్థత వారి దేహానికే పరిమితంచేసి, బుద్ధి కుశలత, మానసిక ఉత్సాహం విషయంలో నిత్య యువకులుగా సాంప్రదాయ సేవ చేశారు. చిన్నవారినుండి ప్రసిద్ధుల వరకు అందరితో కలిసిపోయే వారి సౌశీల్యం శ్లాఘనీయం. శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి వారి కరకమలముల మీదుగా విశిష్టమైన 'గోపాలోపాయనము' పురస్కారం పొందారు.



ముహూర్త చింతామణి, స్తోత్ర కదంబం, పరాశరస్మృతి, లక్ష్మీతంత్రం, శ్రుతప్రకాశికకు ఆంధ్రానువాదం, భగవద్విషయ ఆంధ్రానువాదం మాఘ, వైశాఖ, మార్గశిర మాస మహాత్మ్యములు ఇత్యాది అమూల్యమైన గ్రంథములను కృపచేసిన మహనీయులు.

వారు పరమపదించిన రోజు మనకు అందించిన సందేశాన్ని విశ్లేషిస్తూ ఆవిష్కరించే ఒక ప్రయత్నము.

వారు పరమపదించిన తేదీ 10.11.2024. తేదీని తెలిపే పది అనే సంఖ్య 5 జ్ఞానేంద్రియములను, 5 కర్మేంద్రియము లను సూచిస్తుంది. ఈ పది ఇంద్రియములను చెప్పటం ద్వారా ఉపలక్షణతయా వాటిని శాసించే మనస్సును కూడా చెప్పినట్లయినది. **మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః** అని. అలాగే నెలను సూచించే 11 అనే సంఖ్యలో అంకెలను కూడితే 2 వస్తుంది. ఈ రెండు అనే అంకె ఉభయ లింగ విశిష్టుడు అని అంటే దోషరహితుడు, అనంత కళ్యాణ గుణాత్మకుడు అనియు, మరియు ఉభయ విభూతి నాయకుడు అయిన శ్రియఃపతి శ్రీమన్నారాయణుని సూచిస్తుంది. సంవత్సరమును సూచించే 2024 లోని అంకెలను కూడితే 8 వస్తుంది. ఇది ముక్తిపొందిన పురుషుడు పొందే అష్టగుణ ఆవిర్భావమును సూచిస్తుంది. అపహాత పాప్మా- పాపము లేనివాడు, విజర- ముసలితనం లేనివాడు, విమృత్యు-మృత్యువు లేనివాడు, విశోక-శోకం లేనివాడు, విజిఘంత్స-అపిపాస-ఆకలి దప్పులు లేనివాడు, సత్యకామ- మరియు సత్య సంకల్ప- సత్యములైన భోగ్యభోగోప కరణాదులు మరియు సత్యమైన సంకల్పము మొక్కవోని సంకల్పం కలవాడు. దీన్నిబట్టి అర్థమయిన విషయమేమిటంటే కొనుటకు వీలుకాని (అక్రీత లభ్యేషు) ఇంద్రియములను పరమాత్మ కృపతో ప్రసాదించాడు. అట్టి ఇంద్రియములను మరియు వాటిని శాసించే మనస్సును ఆచార్య సమాశ్రయణ దిశగా మళ్ళించి, ద్వయ మంత్రమును అనుష్టాన పర్యంతము కావించినచో ఆ శ్రియఃపతి కృపతో మోక్షమును పొంది ఈ జీవుడు అష్టగుణావిర్భావమును పొందగలడు.

ఆ విధంగా మోక్షాన్ని పొందిన వైకుంఠ వాసులు శ్రీమాన్ ఉ.వే.ప్ర. డాక్టర్ కందాడై రామానుజాచార్య స్వామి. వారి హృదయమును ఆవిష్కరించటము వలన శ్రీమాన్ స్వామి వారు వ్రాసిన గ్రంథములను అధ్యయనము చేయుటలోనూ మరియు వారి శ్రీసూక్తులను మదిలో పదిలపరుచు కోవటము లోనూ దోహదపడుతుంది. శరీరముతో మన మధ్య లేకున్నా జ్ఞాన స్వరూపముతో అంతటా వ్యాపించి మంగళాశాసనములు కృపచేస్తారు.

**-శ్రీమాన్ డా॥ వోలేటి రవికుమారాచార్యులు**

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

(క్రిందటి సంచిక తరువాయి)

**శ్లో॥ త్రయాణాం వత్సరాణాం చే**
**జ్జన్తోః మృత్యుః స్థితో గృహే।**
**తస్మిన్ ప్రాచ్యే శల్య మస్తి**
**నరస్యేతి వినిశ్చయేత్॥**

గృహము నందు మూడు సంవత్సరముల కొకసారి మరణము సంభవించిన యెడల ఆ గృహమున తూర్పు భాగములో మనుష్య శల్యములుండునని నిర్ణయించ వలయును.

**శ్లో॥ యస్మిన్ గృహే రాజశిక్షా**
**భవేద్యది నిరంతరం।**
**ఆగ్నేయా మస్తి శల్యం హి**
**గార్దభస్యేతి నిశ్చయేత్।**

గృహమున నివసించు వారికి తరచూ రాజదండన కలుగుచున్న ఆ గృహములో ఆగ్నేయ భాగమున గాడిద శల్యములుండునని నిర్ణయించవలయును.

**శ్లో॥ గృహాధిపో దీర్ఘరోగ**
**పీడితో యదిసర్వదా।**
**దక్షిణే దిశి శల్యాని**
**స్థితా నీతి వినిర్దిశేత్॥**

గృహమున నివసించువారు నిరంతరము దీర్ఘవ్యాధితో బాధపడుచున్నచో ఆగృహమున దక్షిణ భాగము నందు దోషకరములగు శల్యములున్నవని నిర్ణయించవలయును.

**శ్లో॥ మృత్యువాతస్థితే యత్ర**
**చోऽత్పన్నశిశు సంతతిః।**
**నైఋత్యాం తద్గృహే శల్యం**
**శునకస్య భవేద్ధృవం॥**

గృహములో జన్మించుచున్న శిశువులందరూ మృతినొందు చున్న ఆగృహములో నైఋతి దిక్కున శునక శల్యములున్నవని నిర్ణయించవలయును.

**శ్లో॥ గృహాధిపస్తు చిత్తస్య**
**చాంచల్యా ద్వత్సరత్రయం।**
**దేశే భ్రమతి చేత్తస్మిన్**
**పశ్చిమే శిశు శల్యకం॥**



గృహమునందు యజమానికి చిత్త చాంచల్యము గలుగుచున్న మూడు సంవత్సరములు దేశముల మీద వెళ్ళిన ఆ గృహము నందు పశ్చిమ భాగమున శిశు శల్యము లుండునని నిర్ణయించవలను.

**శ్లో॥ ద్వాదశేషు చ వర్షేషు**
**శతృబాధా భవేద్యది।**

## శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి

**తన్య తూషాహి వాయవ్యే**
**చాంగారాస్సంతి సంతతమ్॥**

గృహములో నివాసముండు యజమానికి పన్నెండు సంవత్సరములు ప్రబలమయిన శతృవుల భయమున్నచో ఆ గృహమున వాయవ్య దిశలో ఊక మరియు బొగ్గులు వుండునని నిర్ణయించ వలయును.

**శ్లో॥ గృహాధి పస్యాऽర్థవంతః**
**క్రమేణ దశసుద్విషు।**
**వర్షేషు స్యాద్ధనక్షీణే**
**చోత్తరే నర శల్యకం॥**

గృహ యజమాని గృహమును నిర్మాణము చేసినప్పటికి. మిక్కిలి ధనవంతుడై యుండి ఆధనమును పంద్రెండు సంవత్సరములలో క్రమముగా కోల్పోయిన ఆ గృహ మందు ఉత్తర భాగమున మనిషి ఎముకలుండునని నిర్ణయించవలయును.

**శ్లో॥ పశవోऽతిక్షయం యాంతి**
**చేదీశాన్యే గృహే పివా।**
**ఈశాన్య పశుశాలాయాం**
**పశుశల్యాని సంతి హి॥**

గృహమున పశువులు అధికముగా నశించు చుండిన ఆగృహమున ఈశాన్య భాగముగాని పశుశాల యందీశాన్య

భాగము నందు పశు శల్యములుండును.

**శ్లో॥ వంశనాశో భవేచ్చేత్తు**
**గృహ మధ్యేహి భస్మనా।**
**అయః ఖండాని శల్యాని**
**వర్తన్తే నా2త్ర సంశయః॥**

గృహ యజమానికి వంశనాశనము కల్గినచో మధ్య భాగమున శల్యములుగాని, ఇనుపముక్కలు మరియు బూడిద వుండునని నిర్ణయించవలయును.

**శ్లో॥ పశవో బహవశ్చాపి**
**క్షీరహీనా భవంతిచేత్।**
**తత్రాప్యాచ్యాం శిశుశల్యాని**
**సంతి2తి సతతం వదేత్॥**

గృహ యజమానికి పశువులు అధికముగా నుండియు అవి క్షీరముల యివ్వకున్నచో ఆ గృహమందు తూర్పుభాగమందు శిశు శల్యములుండునని నిర్ణయించవలయును

**శ్లో॥ అపమృత్యుభయో యస్మిన్**
**తస్మిన్గృహే తు పశ్చిమే।**
**వృషభస్యహి శల్యాని**
**వర్తన్తే నాత్ర సంశయః॥**

గృహమునందు అపమృత్యువులు అధికముగా గలగుచున్న ఆ గృహమున పశ్చిమ భాగమందు ఎద్దు శల్యము లుండునని నిర్ణయించవలయును.

**శ్లో॥ గృహే సదాచ సర్వేషాం**
**కలహో వర్ధతేయది।**
**గృహమధ్యే శిరశ్శల్యం**
**కపాలం వర్తతే ధృవం॥**

గృహములో నివసించువారు ఎల్లప్పుడు కలహములు పరస్పరము పొందుచున్న ఆగృహమందు తూర్పు భాగమున తల పుర్రె లేదా తల యెముక గాని నిశ్చయముగ నుండునని నిర్ణయించవలయును.

**శ్లో॥ గృహాధిపో క్షయం ప్రాప్తో**
**యదిస్యాత్క్రమశో గృహే।**
**ప్రాచ్యాం దిశితు వర్తన్తే**
**పాద శల్యాని సర్వదా॥**


గృహ యజమాని క్రమముగా క్షయమును పొందుచున్న యెడల ఆ గృహమున తూర్పు భాగమునందు పాదముల శల్యములుండునని నిర్ణయించవలయును. (ప్రాచీన కారిక)

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)


# పుస్తక పరిచయం

## "ఆర్షవైజ్ఞానిక ప్రతిభ"

ఆర్ష జ్ఞాన వైభవానికి, ఆధునిక వైజ్ఞానిక పరిజ్ఞానానికి మధ్య సమన్వయాన్ని తెలియజేసే గ్రంథం "ఆర్ష వైజ్ఞానిక ప్రతిభ". జీవా అకాడమీ మరియు శ్రీ వైష్ణవ సంఘం తెలంగాణ వారి సంయుక్త కృషిలో "జీవా గ్రంథ మాల" 80వ గ్రంథంగా ప్రచురించబడింది. కృతికర్త మహా మహోపాధ్యాయ రాష్ట్రపతి పురస్కార గ్రహీత డా. శ్రీమాన్ సముద్రాల వెంకట రంగ రామానుజాచార్యులు. వేదాలలోని




విజ్ఞాన సంబంధ విషయాలను వివరిస్తూ "అపర" విద్యల విశ్లేషణతో గ్రంథం ప్రారంభ మవుతుంది. భౌతిక అభౌతిక విశేషాలు, సృష్టి విచారణ, పంచభూత తత్వాలు, మూల సృష్టి మొదలగు అంశాలను వివరిస్తూ సందర్భోచిత ప్రమాణాలతో సహేతుకంగా నిరూపిస్తూ సాగుతుంది. ఆధునిక సైన్సులో చెప్పబడు భౌతిక, రసాయన, పశు, వృక్షాది శాస్త్రాల విశేషాలను వైదిక జ్ఞాన విస్తృతితో సమన్వయం చేశారు. అణువు, పరమాణువులను గురించి దార్శనిక సిద్ధాంతములను అనుసరించి సైన్స్ పారిభాషిక (ఆంగ్ల) పదాలతో సహేతుకంగా విశ్లేషించారు. ఈ గ్రంథం ఆధ్యాత్మిక తత్వ అన్వేషకులకు, వైదిక విజ్ఞాన





సంబంధ పరిశోధకులకు, అధ్యయనం చేయు విద్యార్థులకు ఉపయుక్త గ్రంథం. పృథ్వీ, విజ్ఞానం, ప్రాచీన జల విజ్ఞానం అనుబంధ పేజీలుగా మొత్తం 382 పేజీలతో అందమైన ఇరు పుటలతో, చక్కని ముద్రణతో ఈ గ్రంథం కావలసిన పాఠకులకు అందుబాటులో ఉంది. వెల 150 రూపాయలు లభించు స్థానం జీవా క్యాంపస్ శ్రీ వైష్ణవ సదనం, హైదరాబాద్ ఫోన్ నెం 040 29708860



# దాశరథి శతకము

*(భక్తరామదాసుగారి సత్కృతికి 'భద్రవేది' వ్యాఖ్యానసన్నుతి)*



**శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు**

( గతసంచిక తరువాయి.)

1 వ పద్యప్రసూనము - భద్రవేది వ్యాఖ్యానము.

శ్రీ-రఘు-రామ అనే పదత్రయముతో ఈ శతకం శుభారంభమైనది. ఈ మూడు పదాల వైశిష్ట్యం యథామతిగా వివరించుకున్నాము.

అర్థాత్ 'శ్రీ' పదం మంగళాదిగా, శోభావహంగాను, 'రఘు' పదం వంశార్థకముగా, జ్ఞాన, జయ పారంగతత్వముగాను, 'రామ' పదం నామార్థకముగా, ఆనందమయత్వముగాను సాధారణముగా మనకు తెలియుచున్నది.



భక్త రామదాసుగారి సాత్వికత, తాత్వికత, సంప్రదాయికతలను, స్వాంతస్థమును చేసికొన్నచో, వారి యొక్క భావ గరిమను బట్టి పర్యాలోకించిన ఎడల ఈ మూడు పదములు మరో మూడు స్వాపదేశార్థములను బోధించుచున్నవని విజ్ఞులు గ్రహించవచ్చును.

**శ్రీ పదము:** సకల జగత్కారణత్వమును, సకలేతర విలక్షణమైన లక్ష్మీపతిత్వమును తెలియ జేయుచున్నది.

**రఘు పదము:** సకలాధారసమర్థకమైన సర్వజ్ఞత్వమును, సకల నియమన సమర్థకమైన సర్వశక్తిమత్త్వమును, లీలామాత్ర కార్యత్వమును తెలియజేయుచున్నది.

**రామ పదము:** ఆనందమయ బ్రహ్మతత్త్వమును, మోక్ష ప్రదత్వమును ప్రబోధించుచున్నది.

ఏతావతా సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుడే శ్రీరాముడు. అనే పరత్వ ప్రతిపాదనను, అట్టి శ్రీరాముడే ఈ శతకమందు అంతటను కీర్తించబడుచున్నాడనే సూచనను శ్రీభక్త రామదాసుగారు ఈ సంబోధనము ద్వారా మనకు ప్రకటించుచున్నారు. ఈ విశేషభావనకు ఈ శతకంలోని పద్యములన్నీ హృద్యములైన ఉదాహరణములే!

ఈ తొలి పద్యమంతా ఆరుసంబోధనలతో సాగును. మకుటరూపమైన దాశరథీ కరుణాపయోనిధీ అను రెండు సంబోధనలను కలిపినచో, ఎనిమిది సంబోధనలతో కన్పట్టును.

ఈ రెండు సంఖ్యలు సాభిప్రాయకములే అని పెద్దలమాట! ఆరుసంఖ్య షడక్షర తారక మంత్రోపాస్యుడైన రాముని ఆరాధనకు సంకేతముకాగా, ఎనిమిది సంఖ్య అష్టాక్షరతారక మంత్రోపాస్యుడైన నారాయణుని ఆరాధనాత్మకమగుచున్నది.

ఒక ప్రణాళికా బద్ధముగా రచన చేయగల భావనా వైచిత్రి కలిగిన రామదాసుగారి విషయమున ఈ సంభావనము సత్యదూరము కానేరదు.

శ్రీరామాయణమును సంపూర్ణముగా అనుసృజించ దలచిన భక్త రామదాసుగారు చూర్ణికా ప్రక్రియను ఎన్నుకున్నారు. శ్రీరామాయణము 24 వేల శ్లోకములు కలదిగా ప్రథితమైయున్నందున శ్రీరామదాసుగారు 24 చూర్ణికలతో వ్రాయదలచినారు.

గాయత్రీ మంత్రాక్షరములతో నిబద్ధమైన దానిని ఆ 24 అక్షరములకు అధిష్ఠానదైవములయిన 24 కేశవాది మూర్తి మంత్రములతో ఈ చూర్ణికను శ్రీరామదాసుగారు రచించినారు.

24 గాయత్రీ మంత్రాక్షరములే ఆదిగా 24 వేలశ్లోకములను రచించిన చోట శ్రీవాల్మీకి మహర్షి ప్రణాళిక. ఆ 24 గాయత్రీ మంత్రాక్షరములకు అధిదైవములైన కేశవాది చతుర్వింశతి

# దాశరథి శతకము

దైవమూర్తుల 24 మంత్రములను చూర్ణికాంతమున కూర్చి రచించుట మన భక్తరామదాసుగారి అద్భుత ప్రణాళిక.

ఈ ఉదాహరణము భక్తరామదాసుగారి ప్రణాళిక వైచిత్రిని తెలియజేయుట కొరకు ఉదాహరించు కొనుచున్నాము. ఇలాంటి సార్థకములైన ప్రణాళికాంశములు ఈ శతకములోను, కీర్తనలలోను కూడా చాలా ఉన్నవి. సందర్భానుగుణముగా మనం గ్రహించవచ్చును. ప్రకృతం లోనికి వద్దాం! రెండవ సంబోధనము 'చారు తులసీదళదామ!' అని, సుందరములైన తులసీదళ మాలికలను ధరించినవాడా!! అని శ్రీరఘురాముని సంబోధించుచున్నారు.

శ్రీరామాయణమున శ్రీరాముడు తులసీ దళ మాలికలకలను ధరించినట్లు ఎచ్చటనూ కానరాదు. రాజలాంఛనములైన ఆభరణములను ఎన్నింటినో ధరించిన రాముడు, తులసిని ధరించి ఉన్నట్లు వాల్మీకంలో కనుపించదు. మరి! తూలసీదళదాముడు ఎలా అవుతాడు? తులసీ ప్రియుడయిన శ్రీమన్నారాయణుడే శ్రీరాముడు కాబట్టి, ఈ అభినివేశము మదినిండుగా కలిగిన వారు కాబట్టి శ్రీరామదాసుగారు ముందుగా తులసీదళదామునిగా కీర్తిస్తున్నారు.

తులసి సాటిలేనిది.

**తులాం సాదృశ్యం స్యతి నాశయతీతి తులసీ**

అని శాస్త్ర నిర్వచనం. 'హరిప్రియా' అనునది తులసికి గొప్పపేరు.

**నరా నార్యశ్చ తాం దృష్ట్వా తులనాం దాతు మక్షమాః।**
**తేన నామ్నా చ తులసీం తాం వదన్తి పురావిదః॥**

భగవత్ప్రియత్వంలో కాని, భవనాశక మహత్త్వంలో కాని తులసితో పోల్చదగిన వారెవరూ లేరు అనే విషయాన్ని బ్రహ్మవైవర్త పురాణం ప్రకృతి ఖండం తెలియచేయుచున్నది.

గోలోకంలో శ్రీకృష్ణ పరమాత్మతో కలిసి నిత్యానందమును అనుభవించు రస స్వరూపిణి అయిన శ్రీలక్ష్మి యే తులసిగా అవతరించినదని ఆ పురాణ సూక్తి,

భూలోకంలో భగవదర్చన కోసమే వృక్షరూపాన్ని పొంది, భగవదారాధనలో మనకు సాఫల్యమును కలిగించుచున్నది. తులసి లేని ఆరాధనము నిష్ఫలమే యగుచున్నది. ఆ తులసీ వృక్షమును (మొక్కను) నాటుట, పోషించుట, నిత్యమూ దర్శించుట, సేవించుటలు సకలపాపహరములని స్మృతులు తెలియజేయుచున్నవి.

**రోపణాత్ పాలనాచ్చైవ దర్శనాత్ స్పర్శనాదపి।**
**తులసీ దహతే పాపం వాఙ్ మనకాయ సంచితమ్॥**


ఈవిధముగా మరికొన్ని పురాణములు, ఆగమ సంహితలుకూడా తులసి మొక్క యొక్క మాహాత్మ్యాన్ని వేనోళ్ళ కొనియాడినవి.

'ఒక్క తులసీ దళమర్పణ సేయువాడు' అంటూ మున్ముందు పద్యములలో మన రామదాసుగారే తులసి మొక్క మహిమను తెలియ చేయబోతున్నారు.

తులసికి శ్రీరామునికి విభవావతారపరముగా సంబంధము మృగ్యమైనప్పటికీ అర్చావతార పరముగా అద్భుతమైన సంబంధమును ఆగమ సంహితలు ప్రకటించినవి.

ఆ విశేషాలను వచ్చే సంచికలో తెలుసుకుందాము.★

# శ్రీపతి స్తుతి - సుభాషితం
## మంచి మాట



నిత్యానుసంధేయమైన లఘు స్తోత్రాలను, భావ విశేషాలను "శ్రీపతి స్తుతి"- "మంచి మాట" శీర్షిక ద్వారా పాఠకుల కోసం ప్రచురించడం జరిగింది. నిత్యానుష్ఠానంలో పఠించే స్తోత్రాలను భావావగాహనతో పఠించడం వల్ల గొప్ప అనుభూతి కలుగుతుంది. మరియు ఆస్తోత్రంలో గల విశేషార్థాలను తెలుసుకుంటే, ఆ స్తోత్రము యొక్క ప్రాశస్త్యం, ప్రయోజనం కూడా తెలుస్తుంది. అందువలన మరికొన్ని ప్రసిద్ధ స్తోత్రాలను పాఠకుల కోసం ప్రచురించాలని నిర్ణయించడం జరిగింది. ప్రపత్తి శ్రీసన్నిధానం గౌరవ సంపాదకులు, ప్రముఖ పండితులు, శ్రీ.ఉ.వే.శ్రీమాన్ అమరవాది వెంకటనరసింహాచార్యుల చేత పాఠకుల కోసం అందించబడతాయి. ఈ శీర్షికను యథావిధిగా త్వరలో ప్రచురించడం జరుగుతుంది. ★

**శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనరసింహాచార్యులు**

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(క్రిందటి సంచిక తరువాయి)

(సనకసనందనాదుల అవతారం – కొనసాగింపు)

సనత్కుమార మహర్షి – వృత్రాసురుడు

పూర్వం ఒకప్పుడు, వృత్రుడు, ఇంద్రునితో చేసిన యుద్ధంలో పడిపోగా, అతనిని అతని సైనికులు ఎత్తుకొని పోయి, తమ గురువైన శుక్రాచార్యుని ముందు ఉంచారు. అటువంటి అవస్థలో కూడా వృత్రాసురుడు భయం కానీ, విషాదం కానీ లేకుండా, ప్రశాంత చిత్తంతో ఉండటం గురువు గమనించాడు.

ఆయన, "అసురేంద్రా! నీకు ఇటువంటి పరాభవం కలిగినా కూడా దుఃఖించడం లేదే! ఎందుకు?" అని అడిగాడు.

అప్పుడు వృత్రుడు, "గురువర్యా! కలిమిలేములు కాలం వశంలో ఉంటాయి. బుద్ధి హీనులు దర్పం, దైన్యం వల్ల కలిగే సుఖదుఃఖాలు పొందుతారు. సంపదలు అశాశ్వతమని తెలిసినవారికి ఎటువంటి వికృతులూ వికారాలు ఉండవు.

"అంతే కాదు, భూతజాలం ప్రాణులన్నీ కర్మవివశత్వం చేత, దేవతలు, మనుష్యులు, తిర్యక్కులు జంతు పక్షి కీటకాదులుగా పుడుతూ, ఈ జన్మ మృత్యు జరాచక్రంలో తిరుగుతూనే ఉంటాయి. ఇది నాకు తెలుసు కనుక, నాకు దుఃఖమూ లేదు, ఆనందమూ లేదు. నేనిక సుకృత దుష్కృతాల మంచి చెడుల పనుల వైపు వెళ్లకుండా, అనుపముడు ఎవరి తోనూ పోలిక, సాటి లేనివాడు, అచ్యుతుడు చ్యుతి కిందికి జారిపోవడం అనేది లేనివాడు, అవ్యయుడు క్షతి నాశనం అనేది లేనివాడు, అనంతుడు అల్పత లేనివాడు, అనంతమైనవాడు, ఐన శ్రీమహావిష్ణువును పొంది అనామయుణ్ని ఏ వికారాలూ లేనివాణ్ని అవుతాను. నాకు మహావిష్ణువు ప్రభావం తెలుపు" అని కోరాడు.

ఆ సమయానికి సనత్కుమార మహర్షి అక్కడికి వచ్చాడు. అప్పుడు ఆ గురుశిష్యు లిద్దరూ ప్రార్థించగా, సనత్కుమారుడు, మహావిష్ణువు మాహాత్మ్యాన్ని ఈ ప్రకారంగా ఉగ్గడించాడు.

"సమస్త ప్రపంచమూ విష్ణువులోనే ఉద్భవించి, అతనిలోనే వృద్ధి చెంది, ఆయనలోనే లీన మవుతుంది. ఆయనకు ధరణి భూమి పాదాలు. దినం శిరస్సు. దిశలు బాహువులు. ఆతడు సర్వదేవ మయుడు. భూతవిక్షేప సంహారాలు ఆతనికి లీలామాత్రాలు. జీవుని అవస్థలు నలుపు, బూడిద, పచ్చ, పసుపు, ఎరుపు, తెలుపు రంగులతో ఆయనకు నీడలై వెన్నంటి ఉంటాయి. కర్మవశాన తిరిగే జీవుణ్ని ఈ అవస్థలన్నీ పట్టు కొంటాయి. ఉత్తమ మధ్యమ అధమాలైన అవి తనకు కలుగుతూ ఉంటే, జీవుడు,



**శ్రీమతి తిరుమల నీరజ**

స్వర్గం, భూ, నరకలోకాలను అనుభవిస్తూ ఉంటాడు. ఉత్తమ మైన రంగులు ఆవరిస్తే మేలు, అధమమైన రంగులు ఆవరిస్తే కీడు జీవునికి కలుగుతూ ఉంటాయి. కనుక, కర్మరహస్యం గ్రహించిన వాడు, జీవునికి నిత్యపరిశుద్ధి చేస్తూ ఉండాలి. దుర్గంధ కుసుమమైనా, సుగంధ పుష్పాలతో ఆవృతమైతే దుర్వాసన వచ్చే పువ్వయినా, సువాసన లీనే పువ్వుల మధ్య ఉంటే దానికీ ఈ పరిమళాలు అబ్బినట్లుగా, సుకృతాలు చేయటం వల్ల జీవుడు అకళంకుడు కళంకం, మచ్చ లేనివాడు అవుతాడు. సుకృతాలు ఎక్కువవైన కొద్దీ జీవి చింతల కలుషం పోయి, సంతోషామృతంలో సంశుద్ధ డవుతాడు. ఆ అన్ని రంగులలో ఎక్కువైనది తెలుపు. ఆ తెలుపు రంగు అధికంగా అంటుకొన్నప్పుడే, జీవుడు మహావిష్ణువును భావించటానికి తగినవాడవుతాడు. అందు లోని భావమే జీవునికి విముక్తి కలిగిస్తుంది."

ఈ విధంగా బోధించి, వృత్రుణ్ని కటాక్షించి, సనత్కుమార మహర్షి అంతర్హితుడయ్యాడు. వృత్రుడు అమృతసమమైన ఆతని ఆ వచనాల వల్ల ప్రాణాలు విడచి, మహావిష్ణువు సాయుజ్యం పొంది విరాజిల్లాడు.

ఇక సనత్సుజాత మహర్షి వృత్తాంతం తెలుసుకొందాము. నారదులవారు ఒకనాడు మేరుపర్వతంపై సంచరిస్తున్నారు. అక్కడ అంగుష్ఠప్రమాణ మూర్తి బొటనవ్రేలంత ఆకారంతో, వెలిగిపోతున్న అగ్నిహోత్రునివలె ఒప్పుతున్న సనత్సుజాత

మహర్షిని చూశారు. అతనిని ఇట్లా ప్రశ్నించారు "మహాత్మా! అధ్యాత్మ, అధిభూత, అధిదైవాలైన తత్త్వాలన్నిటికీ కర్త, భర్త, హర్త అవుతూ, సమస్తజీవులూ తనను ఆధారం చేసుకొని జీవిస్తూ ఉంటే విరాజిల్లేవాడు ఎవడో తెలుపు."

అప్పుడు ఆ మహా యోగీశ్వరుడు, నారదులవారిని ఆదరించి, "నారదా! శ్రీవిష్ణుమూర్తికి వెయ్యివేల కల్పాలు ఒక రాత్రి, వెయ్యివేల కల్పాలు ఒక దినం. ఇవి నిద్రకు, ప్రబోధనానికీ అనువైన కాలాలు. మహావిష్ణువు రాత్రి నిద్రిస్తూ, పగలు బ్రహ్మాండాలను సృజిస్తూ, బ్రహ్మలనూ కల్పించాడు. ఆ బ్రహ్మలు అహంకారం ఆవహించగా, పంచేంద్రియాలు, పంచభూతాలను సృష్టిస్తారు. ఆ పంచభూతాలకూ శబ్దం స్పర్శ రూప రస గంధాలు ఆవహించి, దేవతలు, మునులు, దానవులు, గంధర్వులు, కింనరులు, నరులు, తదితర జంతుజాలాన్ని కల్పిస్తాయి. అన్నీ కూడా అహంకారం వ్యాపించగా, అవ్యక్త సాగరంలో మగ్నోన్మగ్నాలు మునగడం, తేలడం అవుతూ ఉంటాయి. ఆ అన్నిటికీ పుట్టుక, స్థితి, లయాలలో శుభ అశుభాలను కల్పిస్తూ మహావిష్ణువు, విలాసంగా వినోదిస్తూ ఉంటాడు.

"ఆకాశం మొదలైన పంచభూతాలు, శబ్దం మొదలైన పంచగుణాలు, చర్మం మొదలైన పంచేంద్రియాలు, పాదం తదితర కర్మేంద్రియాలు, అహంకారం, బుద్ధి, మనస్సు, అవ్యక్తం ఇవి ఇరవై నాలుగూ తత్త్వాలు. శ్రోత్రం చెవి అధ్యాత్మం, అధిభూతం శబ్దం, అధిదైవతాలు దిక్కులు. చర్మం ఆధ్యాత్మికం, అందులోని సంస్పర్శ అధిభూతం, దానికి అధిదైవతం మరుత్తు. నేత్ర స్పర్శ అధ్యాత్మం, రూపం అధిభూతం, ఆదిత్యుడు అధిదైవతం. జిహ్వ ఆధ్యాత్మికం, దాని అధిభూతం రసం, అధిదైవతం ఉదకం. ప్రాణం నాసిక అధ్యాత్మం, గంధం అధిభూతం, భూమి అధిదైవతం. ఇది బుద్ధీంద్రియ ప్రపంచం.

"పాదం, వాయువు, ఉపస్థ, పాణి, వాక్కు ఈ ఐదూ కర్మేంద్రియాలు. ఇవి అధ్యాత్మాలు. వీటికి అధిభూతాలు గంతవ్యం నడక, విసర్గం విసర్జన, ఆనందం. ఆనందం పొందడం, కర్తవ్యం పని చేయడం, వక్తవ్యం మాటలు. వీటికి అధిదైవతాలు వరుసగా వసువు, సూర్యుడు, ప్రజాపతి, ఇంద్రుడు, అగ్ని. అహంకారం, మనస్సు, బుద్ధి ఇవి అధ్యాత్మాలు. వీటికి అధిభూతాలు అభిమానం, మంత్రం, నిశ్చయం. అధిదైవతాలు మేధ, చంద్రుడు, బ్రహ్మము. ఇవన్నీ సముద్రంలోని తరంగాల వలె మహావిష్ణువులో పుట్టి, ఆయనలోనే లయ మవుతూ ఉంటాయి. దాని వల్ల ఆయనకు ఏ విధమైన హానీ, వృద్ధీ ఉండవు. అవ్యక్తం అంటే మూలప్రకృతి. దానికి పురుష చైతన్యం కలిగి నప్పుడు, అది మహా వైభవంతో భువన తంత్రాన్ని నడుపుతుంది. లోకకర్త ఐన మహావిష్ణువు, మహాశివుని అనుమతితో ఈ బ్రహ్మాండాలన్నిటినీ పుట్టించి, లయం చేస్తూ ఉంటాడు" అని వివరించాడు.

ఈ ప్రసంగం మంతా విన్న నారదులవారు ఎంతగానో ఆనందించి, సనత్సుజాత మహర్షికి వీడ్కోలు చెప్పారు.

(సశేషం)

## శ్రీపరాంకుశ సుధాంబోధి



**శ్రీమాన్ పి. కృష్ణమూర్తి**

సీ. భోగేచ్ఛ గలిగించి భోగింప జేసెడి
చతురత గలిగిన చంద్రముఖులు
ప్రాయపు మదముతో భ్రమలను గల్పించు
అందచందాలకు ఆశ పడక
సౌదామినిలవంటి సౌందర్య రాశుల
వినయాది గుణముల విందు విడచి
శబ్దించి విజయమ్ము జగతికి సూచించు
పాంచజన్యము చేతబట్టి నట్టి


తే.గీ. వేల్పు సుందర బాహుడు వెలసినట్టి
దివ్య తిరుమాలిరుంశోలి దేవళమ్ము
శశధరునితాకు ఎత్తైన శస్త నగము
ఆశ్రయించుటే కర్తవ్యమవనియందు.

సీ. ఫలితమే లేనట్టి పనులు నిర్వర్తింప
ఫలితమేమి గలుగు భయము తప్ప
కరుణను గురిపించు కరుణాంతరంగడు
వర్షించు మేఘపు వన్నెవాడు
మోహింప జేసెడి మోహనాకారుడు
సర్వేశుడత్యంత సద్గుణుండు
నిత్యవాసముజేయు నిర్మల నిలయంబు
తిరుమాలిరుం శోలి దివ్యధరము

తే.గీ. పుష్పశోభిత వృక్షాల పుణ్యభూమి
మేటి ఉద్యానవనముల మిట్టమిట్టు
ఆశ్రయింపుము ఫల మిచ్చునానగంబు
చేయ దగుకార్యమదిదాని జేయవలయు

# వేదవాక్కు

శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు



(కవితాత్మక విశ్లేషణ )

వేలాది సంవత్సరాలుగా వేళ్ళతో లెక్కపెట్ట వీలుకానన్ని పాపాలతో అజ్ఞానపు వలలో పడి, విలవిలలాడుతున్న మానవాళి వేలు పట్టుకొని విజ్ఞానపు వెలుగులు పంచి, మానవతా విలువలు పెంచిన మన మహర్షుల వాక్కే "వేదవాక్కు". కోతి నుండి మనిషి రాలేదని, విజ్ఞాన జ్యోతి స్వరూపులైన ఋషుల సంతతే మానవుడని " శ్రుణ్వంతు....

పుత్రాః" అంటూ ప్రేమతో సంబోధిస్తూ నశించని అమృతత్వానికి వారసులారా! అని భుజం తట్టి మన నిజ స్వరూపం చూపిన దీపమే "వేదవాక్కు".

ఏ పరిశోధనకైన నేనున్నానని సైగలు చేసే సైన్స్ సైతం సంశయాలతో సైలెంట్ అయిన సమయంలో, సంశయ సమూహాన్ని సమూలంగా సంహరించడానికి సుజ్ఞాన సైన్యంతో సై అంటూ దూసుకొచ్చే,

భరతమాత అంతరంగ నాదం!.

భరతజాతి నిరంతర నినాదం!

భారతీయులకు దక్కిన భగవానుని ప్రసాదం!

భారపు చీకట్లు బాపే భగభగ మండే వేదం!.

సర్వ జగత్కారణ సర్వేలో సర్వేలూ విఫలమైతే తానే సర్వమై సఫలం చేయడానికొచ్చిన విజ్ఞాన సర్వస్వమే వేదవాక్కు!

మన మహర్షులు తెలిపిన విలువైన ధర్మాలను, వేలాది మర్మాలను ఆదమరచి అజ్ఞానంలో ఉన్న మనకు, విడమరచి విజ్ఞానాన్ని పంచడానికొచ్చినదీ వేదవాక్కు!

అవాకులు చెవాకులతో మలినమైన మన వాక్కు అనే వాకిలిని విజ్ఞాన జలంతో అలుకు జల్లి పరమ సత్యాల ముత్యాల ముగ్గు లేసేదే వేదవాక్కు! నా తల్లి చెప్పిందే నాకు వేదవాక్కు! నాతండ్రి చెప్పిందే నాకు వేదవాక్కు! నా ఆచార్యుడు చెప్పిందే నాకు వేదవాక్కని వారి వాక్కునే ఎంతో గొప్ప వేదవాక్కుగ మనం భావిస్తే, "మాతృదేవోభవ!" అంటూ ఆ తల్లి, తండ్రి, ఆచార్యులే ప్రత్యక్ష దైవాలుగా భావించమన్న వేదమాత వాక్కును అసలైన వేదవాక్కని ఇంకెంతో గొప్పగా భావించాలని తెలిపేదే వేదవాక్కు.

స్వార్థంతో తన ఆనందం కోసమే ప్రతిక్షణం పరితపించే మనిషి "ఫిష్ నెట్లో పడి జీవితాన్ని కోల్పోయినట్లు, సెల్ఫిష్ అయిన తాను కూడ ఇంటర్నెట్‌లో పడి జీవితాన్ని కోల్పోతుంటే ఆనందం కోసం సర్చ్ చేయాల్సింది ఇంటర్నెట్లో కాదు ఇన్నర్‌సెట్లో అని తెలిపేది వేదవాక్కు!

అరక్షణానందం కోసం అనుక్షణం బయట వెతుకుతూ సిన్నర్ అవుతున్న తనకి, అనుక్షణానందం నీ ఇన్నర్నెట్లోనే అరక్షణమైన అవధానంతో చూస్తే తెలుస్తుందని తెలిపి, ఇన్నర్ బ్యూటీని చూపి విన్నర్‌గా చేయడానికొచ్చిన విలువైన విజయవాక్కే ఈ వేదవాక్కు !

ఇంటర్లోకి కూడా రాకముందే, ఎంటర్ కాకముందే ఒంటరితనంతో, తుంటరి ఆలోచనలతో బాధపడే యువత మెంటల్ స్టేజీని సరిచేసే మెంటర్సే మన మహర్షులని తెలిపేదే వేదవాక్కు!

నాసావారు అంతరిక్షపు అంచుల వరకూ వెళ్ళి సృష్టి రహస్యాలను తెల్సుకోలేక వెనుతిరిగితే, వెన్ను నిటారుగా నిలిపి, నాసాగ్రముపై దృష్టి నిలిపి, తమ అంతర్గతంలోనే అన్నీ తెల్సుకొని "నాసా పరిశోధన కన్నా నాసాగ్రముపై సాధనే మిన్న" అని తెలిపి వెనుతిరిగిన వారి వెన్నుతట్టి జీవితానికే వన్నెలు దిద్దే వెన్నెల వేదవాక్కు!

వేదవిజ్ఞానాన్ని వెన్నపూసలా అందించిన వేదజ్ఞులైన వేదవ్యాసాది ఋషుల వైభవమే వేదవాక్కు!

ఎన్ని స్కిల్స్ ఉన్నా ముందుకు దూసుకెళ్ళ లేక బాధని మోసుకెళ్ళ లేక సతతమూ సతమతమవుతున్న మనిషికి పరమ హితాన్ని తెలుపుతూ జీవితంలో ఉన్నత స్థితిని చేరడానికి స్కిల్ పవర్ మాత్రమే కాదు విల్ పవర్ కూడా కావాలని దాని నందించేదే వేదవాక్కు!

జీరో అవుతున్న నరులను హీరోలుగా చేసి వీరార్జునివలె వారియర్లు చేయగలిగేది వేదవాక్కు.

ఉన్నత స్థితి కోరేవారికి ఉత్తమోత్తమ ఉపదేశం, సకల మానవాళికి సర్వేశ్వరుని సందేశం, ఆధాత్మిక చైతన్యానికి ఆది నారాయణుని ఆదేశం వేదవాక్కు!

★





# కృష్ణం వందే జగద్గురుం

లోకమునందు ప్రతీ మానవుడు ఏదో ఒక దుఃఖ స్థితిని అనుభవించుచున్నవాడే. ఆ దుఃఖము మోహము వలన అజ్ఞానమువలననే సంభవిస్తాయి. వాటిని అధిగమించి మానవుడు జీవించటమే మానవ లక్ష్యం.

**ఇచ్ఛాద్వేష సముత్థేన మోహద్వంద్వేన భారత**
**సర్వభూతాని కౌంతేయ సర్గే యాంతి పరంతప** (7-27 )

మానవులు పుట్టుకతోనే రాగద్వేషములతో పుడుతున్నారు. వీటి వ్యామోహములో పడి మానవుడు తన విచక్షణా జ్ఞానము కోల్పోతున్నాడు. అజ్ఞానములో పడిపోతున్నాడు. సర్వప్రాణులు పుట్టుకతో సహజముగానే మోహమును కలిగియుంటాయి. మోహము అనగా అజ్ఞానము, వైచిత్ర్యము (మనసు స్వాస్థ్య స్థితిని కోల్పోవుట).

అర్జునుడు శ్రేష్ఠ క్షత్రియ వంశమునందు పుట్టినవాడు. ఆయనకు కలిగిన మోహము సహజమైనదికాదు. యుద్ధభూమియందు కారుణ్య బంధు స్నేహ జనిత శోకము వలన కలిగినది. మోహము వలన ధర్మ అధర్మ అవివేకము కలిగి సందిగ్ధావస్థలో పడ్డాడు అర్జునుడు.

ఈ సంసారము బంధుమిత్రాదులతో కూడియున్న యుద్ధభూమియే! రాగద్వేషములు అవివేకము, అనేవి సంసారమునందు మానవునికి శత్రువులు. వీటిని జయించి మోహమును, అజ్ఞానమును అధిగమించుటయే మానవ లక్ష్యము. ఇది కేవలము తత్వబోధ ద్వారా మాత్రమే సంభవము. ఒక్కొక్క ప్రాణికి ఒక్కొక్క విధమైన మోహము ఉంటుంది. సర్వాంతర్యామియైన పరమాత్మయే సకల ప్రాణులకు అవసరమైన హితమును ఉపదేశించగలడు.

"క్షేత్రజ్ఞం చ మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత" (13-3 ) సర్వ క్షేత్రముల యందు ఉండే క్షేత్రజ్ఞుడయిన పరమాత్మను తెలుసుకోవటమే జ్ఞానము అందుకే భగవానుడు ఆ జ్ఞానమును మనకు తెలియ జేస్తున్నాడు.

**ఉత్పత్తించ వినాశంచ భూతానాం అగతిం గతిం।**
**వేత్తి విద్యాం అవిద్యాంచ స వాచ్యో భగవాన్ ఇతి॥**

సకల ప్రాణుల ఉత్పత్తి నాశము, సుఖదు:ఖములను, జ్ఞాన అజ్ఞానములను తెలిసినవాడు భగవంతుడు. శ్రీకృష్ణభగవానుడు భగవద్గీత ద్వారా అర్జునుని నిమిత్తముగా సర్వమానవాళికి తత్వబోధ చేసాడు. కేవలము తత్వాన్ని బోధిస్తే సరిపోదు. ఆ తత్వము యొక్క అవగాహన



**శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య**

కలగవలెను. మరియు తదనుభవమునకై ప్రయత్నము చేయవలెను. అంతే కాదు ఆచరణ మార్గమును సైతము తెలియ వలెను.

18 అధ్యాయాలలో వీటన్నిటినీ బోధించాడు శ్రీకృష్ణభగవానుడు. "భగవద్గీత" సిద్ధాంతము మరియు అనుష్ఠాన మార్గమును బోధించు గ్రంథము.

సాంఖ్య యోగము. తత్వబోధతోనే ప్రారంభమైనది. సాంఖ్యం అనగా ఆత్మ నిత్యత్వ జ్ఞానము. ఇది 24 పదార్థ తత్వములు, ప్రకృతి పరిణామవాదాన్ని ప్రతిపాదించే కాపిల సాంఖ్యముకంటే భిన్నము. ఆత్మ యథార్థ జ్ఞానము కలవాడు సంసారమునందు ఏదు:ఖమూ అనుభవించడు. అందుకే అర్జునుని మోహశాంతికై ముందుగా పారమార్థిక ఆత్మ జ్ఞానబోధతోనే ప్రారంభించాడు శ్రీకృష్ణభగవానుడు.

ఈ అధ్యాయమందు ఆత్మ జ్ఞానముతో పాటు ఆత్మసాక్షాత్కార (మోక్ష) స్థితిని పొందుటకు ప్రధానమైన కర్మాచరణ పద్ధతి బుద్ధి యోగము మరియు స్థిత ప్రజ్ఞతలు తెలుపబడ్డాయి.

# ధనుర్మాస వైశిష్ట్యము

ప్రత్యేకం



**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం

శ్రియఃపతియైన శ్రీమన్నారాయణునకు అత్యంత ప్రీతికరమైన మాసము ధనుర్మాసము. సూర్యుడు ధనూరాశిలో సంచరించే మాసమునకే, సౌరమానం ప్రకారం ధనుర్మాసమని పేరు. ఈ మాసంలో విష్ణువును ఆరాధించుట సకలశ్రేయోదాయకము. ప్రధానముగా శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందినవారు ఈ మాసంలో నియమ బద్ధంగా వ్రత విధానముగా విష్ణ్వారాధనము నిర్వర్తిస్తారు. ఈ ధనుర్మాస వ్రతమును ఆచరించుట వల్ల నెలకు మూడు వానలు కురిసి పాడి పంటలతో దేశమంతా సస్యశ్యామలంగా ఉంటుందని ప్రాచీనుల ప్రబల విశ్వాసం.

భాస్కరీయ జ్యోతిశ్శాస్త్రంలో

**ఆయనం దక్షిణం రాత్రి రుత్తరం తు దినం భవేత్।**
**దైవతం తదహోరాత్రం తత్రింశత్ మాస ఉచ్యతే॥**

మనుష్యులకు రాత్రి-పగలు వలె దేవతలకు దక్షిణాయనము రాత్రి, ఉత్తరాయణము పగలు. అట్టి అహోరాత్రములు ముప్పది మాసముగా చెప్పబడుతున్నది.

**తద్దినస్య ఉషః కాలం చాపమాసం విదుర్బుధాః।**
**తస్మాత్ సర్వ ప్రయత్నేన చాపమాసే దినేదిన॥**

దేవతలకు ఉషః కాలము (తెల్లవారు ఝాము) ధనుర్మాసముగా విద్వాంసులు గుర్తిస్తారు. అందువల్ల ధనుర్మాసంలో ప్రతిరోజూ ప్రయత్న పూర్వకముగా

**ఉషః కాలే తు సంప్రాప్తే బోధయిత్వా జగత్పతిమ్।**
**సమభ్యర్చ్య భజేత్ విష్ణుం జనానాం దోష శాన్తయే॥**

తెల్లవారు ఝామున జగన్నాథుడగు మహావిష్ణువునకు సుప్రభాతమును పలికి చక్కగా అర్చించవలెను. తద్వారా జనులకు సమస్త దోషములు శాంతించును. అని ధనుర్మాసంలో విష్ణ్వారాధన సర్వపాపహరమని ఉన్నది.

బ్రహ్మాండ పురాణం లో

**ఆషాఢాదిషు మాసేషు శయానం కార్తికావధి**
**చాపంగతే దినానాధే ఉద్ధాప్య శయనాత్ హరిమ్**
**సవిష్ణు లక్షణైః స్తోత్రైః బహుభిః పరిగీయతే**
**ఉషః కాలే తు సంప్రాప్తే అర్చయిత్వా జనార్దనమ్।**
**ఉపచారైః షోడశభిః ముద్గాన్నం చ నివేదయేత్॥**

"ఆషాఢ మాసం నుండి కార్తీక మాసం వరకు మహా విష్ణువు శయనించును. సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన తర్వాత మహా విష్ణువును ఉషఃకాలమున సుప్రభాతాది మంచి స్తోత్రము లతో మేలుకొలిపి అర్చన చేసి షోడశోపచారములతో ముద్గాన్న మును (పొంగలి) నివేదించ వలెను." అని చెప్పబడింది.

ఆదిత్య పురాణంలో

**చాపంగతే తతః సూర్యే ప్రత్యూషే స్నాన మాచరేత్।**
**అర్చయే చ్చ జగన్నాథం యావత్ సూర్యోదయాత్ పురా॥**
**తతః ప్రభాత సమయే అర్ఘ్యం ప్రక్షిప్య వైష్ణవమ్।**
**గాయత్రీం చ తతో జప్త్వా ఉపతిష్ఠేత భాస్కరమ్॥**

"సూర్యుడు ధనూరాశిలో సంచరించే ధనుర్మాసంలో ఉషః కాలంలో (తెల్లవారుఝాము) స్నానమాచరించి సూర్యోదయాత్ పూర్వమే జగన్నాథుడగు మహావిష్ణువును అర్చించవలెను. సూర్యోదయమైన తర్వాత సూర్యునికి అర్ఘ్యమును ఇచ్చి, గాయత్రీ జపము చేసి, సూర్యోపస్థానము చేయవలెను." అని ధనుర్మాస పూజను సూర్యోదయమునకు ముందే చేయవలెనని చెప్పబడింది.

విష్ణు సూక్త మందు కూడా

**తదస్య ప్రియ మభిపాథో అశ్యామ్।**
**నరో యత్ర దేవయవో మదన్తి।**
**ఉరుక్రమస్య స హి బన్ధు రిత్థా।**
**విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః।**

"విష్ణువునకు ప్రియమైన అనగా ఆయనకు నివేదించిన అన్నాదికమును భుజించెదము. దైవారాధకుడు భగవన్నివేదిత తీర్థ ప్రసాదాదులను స్వీకరించి సంతుష్టుడౌతాడో అతడు భగవంతునికి ప్రీతి పాత్రుడౌతాడు. సర్వోత్కృష్టమైన భోగ్యమైన భగవంతుని పాదముల యందు భక్తి కలవాడు

కాగలదు.” ఉన్నది కావున విష్ణుప్రీతికరమైన ధనుర్మాసమున తెల్లవారు ఝామున ఆయనను ఆరాధించి ముద్గాన్నాదులను నివేదించి తీర్థ ప్రసాదాదులను స్వీకరించుట. విష్ణుప్రీతి కరము. ఇదియే సకలాభీష్టప్రదము.

పరమ శివుని భర్తగా పొందగోరిన పార్వతీదేవి ధనుర్మాసంలోనే తీవ్రమైన తపస్సు చేసి పరమశివుణ్ణి పతిగా పొందగలిగింది. అదే విధంగా గోపికలు శ్రీకృష్ణుణ్ణి తమ పతిగా పొందగోరి కాత్యాయనీ వ్రతాన్ని ఈ ధనుర్మాసంలోనే ఆచరించారు. తద్వారా శ్రీకృష్ణుణ్ణి తమకు పతిగా గోపికలు పొందగలిగారు. ప్రతినిత్యం విష్ణుచిత్తులనే ఆళ్వారు శ్రీమద్భాగవతాన్ని ప్రవచిస్తూ, ఈ కాత్యాయనీ వ్రతాన్ని గోపికలు ఆచరించిన ఘట్టాన్ని ఒక సందర్భంలో చెపుతుండగా విన్న ఆయన పుత్రిక గోదాదేవి, తాను కూడా గోపికల వలె ఈ కాత్యాయనీ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుని పతిగా పొందాలని సంకల్పించింది. ఆ సంకల్పాన్ని సాకారం చేసుకొంటూ ధనుర్మాసంలో వ్రతాచరణం చేసింది. ఆ వ్రత ఫలంగానే శ్రీకృష్ణుని అర్చారూపియైన శ్రీరంగనాథస్వామికి అర్ధాంగియైనది గోదాదేవి. ఈ గోదాదేవి, విష్ణుచిత్తుల ఆచరణయే ప్రపన్నులగు శ్రీవైష్ణవులకు ఆదర్శమైనది.



ధనుర్మాసమున గోదాదేవి, గోపికలను అనుకరిస్తూ ఈ ధనుర్మాస వ్రతాన్ని విలక్షణమైన రీతిలో ఆచరించింది. శ్రీవిల్లిపుత్తూర్ అను క్షేత్రమే బృందావనంగా, ఆక్షేత్ర అధినాథుడగు ‘వటపత్రశాయి’ అను భగవానుని అర్చామూర్తియే శ్రీకృష్ణుడుగా, తాను, తన సఖులు గోపికలుగా భావిస్తూ గోపికా భావనతో గోదాదేవి ఆచరించిన ధనుర్మాస వ్రతం, ఆమె కోరిన విధంగా భగవంతునికి (అర్చామూర్తికి) ఇల్లాలిగా అయ్యే ఫలితాన్ని ప్రసాదించింది. ఆమె తండ్రియైన శ్రీ విష్ణుచిత్తులు భగవంతునికే పిల్లనిచ్చిన మామగారు అయ్యారు. ఈ గోదాదేవి యొక్క ధనుర్మాస వ్రతాచరణ వృత్తాంతం వల్ల మనకు భగవదర్చామూర్తి ప్రభావం అవగతమవుతుంది.

ఆలయములలోని విగ్రహములను మనం అచేతనమైన బొమ్మగానే భావిస్తుంటాం. నిజానికి అవి కేవలం శిలా లోహాది విగ్రహములుగా భావించరాదు. గాఢమైన భక్తితో ఆ విగ్రహములను మనం ఆరాధిస్తే ఆ విగ్రహములు వాటి అచేతన స్వభావాన్ని పోగొట్టుకొని చైతన్యవంతములై ఆరాధకుల అభీష్టాలను నెరవేరుస్తాయి.

మహాభారతంలో, ఏకలవ్యుడు ద్రోణాచార్యుని విగ్రహమును ఆరాధించి అర్జునునితో సమానంగా విలువిద్యను అభ్యసించగలిగాడు కదా! మనకు ఆగమ శాస్త్రాలు విగ్రహాన్ని ఎలా ఆరాధిస్తే మన అభీష్టాలు సిద్ధిస్తాయో చెప్పాయి. కానీ, ఆళ్వారులు, విష్ణుచిత్తులు, గోదాదేవి తమ భక్తి ఆచరణ ద్వారా విగ్రహారాధనలోని మర్మాన్ని ప్రకాశింపజేశారు.

ముఖ్యంగా గోదాదేవి ఈ ధనుర్మాస వ్రతాచరణ ద్వారా ఈ ధనుర్మాస వైశిష్ట్యాన్ని, విగ్రహారాధనలోని మర్మాన్ని ఎన్నో ఉపనిషద్వాక్యాలలో రహస్యంగా ఉన్న బ్రహ్మవిద్యా రహస్యాన్ని మన బోటి సామాన్యులకు కూడా తెలిసే విధంగా ‘తిరుప్పావై’ అనే ప్రబంధం ద్వారా ఎఱుక పరచింది.

శ్రీవైష్ణవ సంప్రదాయమును అనుసరించు వారంతా ఈ ధనుర్మాసంలో సూర్యోదయానికి ముందే స్నానమాచరించి విష్ణు ఆలయములకు వెళ్ళి అక్కడ గోష్ఠిగా ‘తిరుప్పావై’ ప్రబంధ పారాయణ చేసి తీర్థ ప్రసాదాదులు స్వీకరిస్తారు. అదే విధంగా మరికొంత శ్రద్ధ కలవారు స్వయంగా తమ గృహములలో సూర్యోదయానికి ముందే స్నానానుష్ఠానములు ముగించి విష్ణువును ఆరాధించి, ‘తిరుప్పావై’ పారాయణ, ముద్గాన్న నివేదనలు చేసి ధనుర్మాస వ్రతాచరణ చేస్తారు. ఇలాంటి వ్రతాచరణ వైదికమైనది, సనాతనమైనది, సకలాభీష్ట ప్రదమైనది. ధనుర్మాస వ్రతమును ఆచరించి తరించుదాం.

# జ్యోతిర్విజ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక



అలంకార వాస్తులో అనేక ప్రధాన భాగాలున్నాయి. అందులో వృక్ష సంరక్షణ కూడా ఉంది. మనం పెట్టుకోగలిగితే వాకిలి నిండా చెట్లు పెట్టుకుంటాము. లేదంటే చిన్న చిన్న కుండీలలో కూడా పెంచుకుంటాము. తద్వారా కలిగే దేమిటి? అంటే వాస్తుశాస్త్ర నిపుణులే కావచ్చు, జ్యోతిష్య శాస్త్ర వేత్తలే కావచ్చు, ఈ చెట్టు ఉండవచ్చు. ఈ చెట్టు ఉండరాదు. అని నిర్ధారణ చేసి చెబుతూ ఉంటారు. ఆ విషయాలు వాస్తు శాస్త్రంలో కూడా చెప్పబడ్డాయి.

పెద్ద పెద్ద వృక్షాలు ఇంట్లో పెట్టుకున్నప్పుడు దాని వేర్ల ద్వారా ఆ యింటి పునాదులు కదలడంగానీ విసురుగా గాలి వీచినప్పుడు దాని కొమ్మలు విరిగి పడటం, తద్వారా గృహానికి నష్టం కలుగుతుంది. ఈ విషయాన్ని మన ప్రాచీనులు అలనాడే గుర్తించారు. ఏరకమైన చెట్టును ఇంట్లో పెట్టవచ్చు ఏరకమైన చెట్టు అడవిలో ఉండవచ్చు. అనే విషయాన్ని తెలియజేశారు.

వృక్షముల లక్షణాలను తెలుసుకోవాలి ఎందుకనగా కొందరు ఈ చెట్టు 'ఇంట్లో ఉండరాదండీ' అనగానే మనకు తెలియక ప్రాచీనులు ఏర్పాటు చేసిన వాటిని కొట్టి వేయటం జరుగుతుంది.

అలనాడు మనకు నేలపైన స్థలముండేది. నేడు ఇంటి చుట్టు ఒక మనిషి దూరేంత చిన్నగా సందును ఏర్పరచి ఒకరి గాలిని మరొకరు పీల్చుతూ అనారోగ్యాన్ని పెంచుకుంటూ ఇబ్బందిగా జీవిస్తున్నాము.

నేటి కాలంలో గృహనిర్మాణంలో చిత్రవిచిత్ర మార్పులు కలుగుతున్నాయి. ఇంటి శ్లాబ్‌పై మట్టివేసి చెట్లు పెట్టుకోవచ్చు. వాస్తు శాస్త్రంలో శిల్ప శాస్త్రం కూడా ఒక భాగము. ఆ శిల్పశాస్త్రంలో ఇంటిలో ఏ చెట్టు వుండవచ్చు ఏచెట్టు ఉండకూడదనే విషయమును ప్రస్తావన చేస్తూ, ఒక పద్యం చెప్పబడింది. దాన్ని మనం అర్థంచేసుకుంటే అవకాశం ఉన్న వృక్షాలను పెంచటము, తద్వారా ప్రకృతిసేవ చేసిన ఫలితం పొందవచ్చు.


**మల్లె మల్లెయు పోక మరువము గన్నేరు**
**దాసాని ఖర్జూర జాజి నిమ్మ**
**పూరి పున్నాగ పత్తి నారికేళంబు**
**వేప పొన్నాగ తులసియు పొగడ పొన్న**
**కానుగ మద్ది శీకాయ సంపెంగ**
**జామ మందార సురతర మాసిపత్రి**
**పన్నీరు కస్తూరి పట్టెడ జడపత్రి**
**రామ ఫలంబు మనోరంజనిగను**
**గృహము నలుగట్లు ఈ చెట్లు కూడినాడు**
**ఇంద్రభోగంబు గలుగు ఆయింటి యందు**
**శ్రీలక్ష్మి నిరతంబు శ్రేయమొసగు**
**శిలిపి శాస్త్ర మతమిది శ్రీమహేశా**

ఇన్నిరకాల చెట్లలో కొన్నే పెద్ద వృక్షాలున్నాయి. కానీ అన్ని చిన్న మొక్కలే ఉన్నాయి. ఇవి ఇంటి చుట్టూ పెట్టుకోవచ్చు. పెట్టుకోకూడని చెట్లు కూడా ఉన్నాయి. అంటే! పెట్టకూడనివి అని కాదు. ఇంట్లో మాత్రం పెట్టుకొనుటకు అవకాశం లేని చెట్ల గురించి వివరించారు మరొక పద్యంలో.

**మర్రి చింత రావి బూరుగ పులిసేరు**
**తుమ్మ ఈత తాటి దేవదారు**
**నెమలి జువ్వి మేడి నీలార్క దులు దుమ్మ**
**పాల కొడి సేటి చన్ర పాచి తీగ**
**టేకు వెలగ తావి తెల్ల లొద్దుగ రాలె**
**మునుగ గోకుడు జెముడు ముళ్ళ పొదలు**
**గృహము నలుగట్ల ఈ చెట్లు కూడెనేని**
**యశము దప్పియు లక్షియు వశము దప్పు**

**"యోగ భోగము లుడిగి రోగవృద్ధియు గల్గునంచు పలికిరి భువిన ఆది మునులు..."** అని ఇలాంటి చెట్టును పెంచుకోవటం ద్వారా ఎలాంటి ఫలితాలు వస్తున్నాయి, వస్తాయి అని చెప్పబడింది. చెట్టు నీడనిస్తుంది. పువ్వులు పండ్లు కాయలు ఆకులు (మిగతా 26 వ పేజీలో)

# భగవదాలయములు - నియమ నిబంధనలు



**శ్రీమాన్ శ్రీ తిరువరంగం దాస శేషాచార్యులు**

ఒక దేశంలో నివసించు ప్రజలు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలతో జీవించుటకు అనేకమైన చట్టాలు చేయబడుతాయి. వాటిని అమలు చేయటానికి అనేకమైన విభాగాలను ఏర్పాటు చేసి అమలు చేయటం జరుగుతుంది.

ఒక దేశాన్ని రక్షించటానికి కావలసిన రక్షణ విధానం కూడా ఒకటి ఉంటుంది. ఆ రక్షణ చట్టాల ద్వారా దేశం లోపల మరియు బయట ఉండే శతృ దేశాల నుండి ఏర్పడే బాధలనుండి, దాడులనుండి మనకు మనం రక్షించుకునే వీలుంటుంది.

అదేవిధంగా దేవాలయాలలో జరుగవలసిన ప్రతిష్ఠ, అర్చన, విధివిధానాలను తెలియచేసేది నిర్ణయించేది ఆగమ శాస్త్రం. ఈ ఆగమ శాస్త్రం. ఆయా దేవతలను బట్టి వైష్ణవ, శైవ, శాక్తేయ ఆగమాలుగా చెప్పబడినవి.

వైష్ణవ ఆగమము మరల వైఖానస, పాంచరాత్రముగా రెండు విధాలుగా చెప్పబడినది. ఈ రెండు ఆగమములలో ప్రక్రియా భేదము ఉన్నప్పటికి వాటికి ప్రామాణ్యమును తెలియ చేసినవారు శ్రీయామునాచార్యులు, రామానుజాచార్యులు, వేదాన్త దేశికులు మొదలగు వారు. “పాంచరాత్రవత్ వైఖానస మపి సర్వాంత్మానా ప్రమాణమ్” అని తమ గ్రంథాలలో, ఈ రెండు సమానమైన ప్రమాణములే గాని, వీటిలో ఎటువంటి తారతమ్యమును లేదు అని తెలియ చేసినారు. వీటిలో లేని పోని తేడాలను సృష్టించి కొందరు వాదులాడు కోవటం కేవలం ఒక మూర్ఖపు చర్య అని భావన.

ఆగమసిద్ధమైన ఈ అర్చనా విధి విధానాలు అందరికి ఆమోద యోగ్యమైనవి. హితమైన నిత్య సత్యాలు, వైదిక శాసనాలే గాని తిరస్కరించేవి కావు. కాని భాషాభిమానంతో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆలయ ఆరాధన విధానాలపైన విధించిన శాసనాలు చెల్లవు అని సుప్రీంకోర్టు కొన్ని కేసులలో ఇచ్చిన తీర్పులు గమనించవచ్చును.

ఆలయ నిర్మాణము మొత్తం కూడా వాస్తు, జ్యోతిషము మొదలైన శాస్త్రనియమాలతో కూడుకొని ఉంటుంది. శంఖు స్థాపనం మొదలుకొని గర్భాలయం గోపురాలు, ప్రాకారాలు, మంటపాల నిర్మాణాలు, మూలమూర్తి నిర్మాణం మొదలైన వన్నీ శాస్త్ర నిర్మితమైన కొలతల తోను, నిర్దిష్టమైన శిలా లోహాది మూల ద్రవ్యాలతోటి ఏర్పర్చబడినవి. వాస్తు దేవతల, గ్రహదేవతల ఆవహనశక్తి మొదలైన విశేషాల చేతనే ఆలయాల పవిత్రత, గ్రామ, దేశ, ప్రజా క్షేమములు భద్రంగా ఉంటాయి. ఇవి సామాన్య ప్రజల కంటికి కనపడని అతి సూక్ష్మ ప్రభావం గల విషయాలు. ఈ నియమ నిబంధనలను పాటించని రోజున సర్వదేశ సంక్షోభము తప్పదు. శాస్త్ర నియములను. నిబంధనలను ఆచార వ్యవహారాలను చిన్నవిగా (తృణప్రాయంగా, హేళనగా) తిరస్కరించటం, అవహేళన చేయటం మన అవివేకం.

వేద ఆగమాలలో శాస్త్రాలలో కొన్ని ప్రమాణమైన సూక్ష్మ విషయాలను చూచినట్లయితే, పదార్థాలలో ఉండే స్థూల, సూక్ష్మ శక్తులు మన యొక్క అల్పబుద్ధితో ఊహించ రానంత నిగూఢమైనవి.

మన ప్రాచీన శాస్త్ర వేత్తలు మొత్తం పదార్థాలన్నింటిలో కొన్ని మంగళకరమైనవి. (మంచివి) కొన్ని అమంగళకరమైనవి అని విభజించినారు.

ఉదాహరణ: ఇనుముతో మంగళ సూత్రాలు చేయించుకోరు, రత్నాలు సువర్ణము కాళ్ళకు మట్టెలుగా, పాదాలకు ఆభరణాలుగా పెట్టుకోరు. శ్మశానంలో ఉన్న అగ్నిని (నిప్పు) ను తెచ్చుకొని పూజలు చేసుకోము. ఆలయాలలో జరుగకూడని 32 అపచారములను. వరాహ పురాణంలో తెలియచేసినారు. ఇక్కడ కొన్నింటిని వివరించుకుందాం.

(మిగతా వచ్చే సంచికలో)

# క్షత్ర బంధుడు



శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.

## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు

**తిరుక్కోళూరు పెణ్ పిళ్ళై పలికిన 81 వాక్యరత్నములు:-**

**శ్రీ వైష్ణవుల నీతి, చరిత్ర, సూక్తులను కేవలం 81వాక్యాలతో సంక్షిప్తం చేసి శ్రీరామానుజులకు ఒక్కొక్క భాగవతుని గూర్చి, 81 వాక్యాలతో సంగ్రహించారు పెణ్ పిళ్ళై గారు.**

**అందులో భాగంలో 9 వ భక్తుడైన, క్షత్ర బంధువును గూర్చి ఆమె క్రింది విధంగా తెలియ చేస్తున్నారు.**

**"మూన్నె ఉత్తు శొన్నేనో క్షత్ర బంధునై ప్పోలే" మూడు అక్షరముల గోవింద నామం ఉచ్చరించి క్షత్ర బంధువు అనాయాసముగా పరమ పదం పొందినాడు. అంతటి భక్తి నాకు లేదు కనుక ఈ ఊరిలో ఉండ తగను కదా స్వామి అంటూ ఆమె యొక్క ప్రపన్నతను తెలియ చేశారు పెణ్ పిళ్ళై గారు.**


క్షత్ర బంధుడు విశ్వరథ రాజు కుమారుడు. క్షత్ర బంధు అనగా, క్షత్రియులలో అట్టడుగు వాడని, నీచ స్వభావం కలవాడు కనుక అతనిని అలా పిలిచేవారు. ఒక రాజ్యానికి యువరాజైనా ప్రజల పట్ల శ్రద్ధ బాధ్యత లేనివాడు. చిన్న తనం నుండి అవిధేయుడుగాను. తిరుగు బాటు దారునిగానూ ఉండేవాడు. రాజుగారు, రాణి గారు కూడా, కుమారునిపై ఉన్న ప్రేమతో వానికి మంచి మర్యాదలు నేర్పక పోవటంతో, ఏళ్ళు గడచినా, అతనిలో అల్లరితము కొంటెతనం పెరిగి, చివరికి ఆతని ప్రవర్తన భరించలేని, ప్రజలు వానిని అడవిలోకి కొట్టి తరమేశారు. అడవిలో కూడా కనుపించిన వారిని హింసిస్తూ గడిపేవాడు.

ఒక రోజు అదే అడవికి ఒక ఋషి, రావడం జరిగింది. ఎండవేడిమి బాగా ఉండటాన ఆయనకు దాహం వేసింది. చుట్టూ చూసి అక్కడ వున్న ఒక చెఱువులో దిగి, దాహం తీర్చు కున్నాడు. ఋషి ఆపై పైకి వస్తుండగా కాలు జారి చెఱువులో పడ్డాడు. అక్కడే ఉన్న క్షత్ర బంధుకు జాలి కలిగి, ఆఋషిని రక్షించాడు. ఆదరించి, దుంపలు, పండ్లు యిచ్చి, సేద తీర్చాడు. ఋషి చాలా సంతోషించి, ఈ అడవిలో ఒంటరిగా ఎందుకున్నావు, అంటూ అడిగిన దానికి, ఏమీ దాచకుండా, తాను దుర్మార్గుడనని, ప్రజలు తరిమేశారని మొత్తం చెప్పాడు. ఎంతటి దుర్మార్గుడైనా, అతనిలో గల రక్షించే గుణానికి ఆనందించి, అతనిని దిద్దు బాటు చేయాలను కుంటాడు ఋషి. మంచి సలహా ఇస్తాను వినుమని చెప్పి నీకు మూడు అక్షరాలను చెబుతాము. నీవు ఏ పనిచేసినా, ముందుగా ఈ నామం పలుకుతూ ఉండు. అని "గోవింద" నామం. చెప్పాడు ఋషి. ఈమాటే అన్ని వేదాలు చెప్పాయి. అవి, "అంబరమే తణ్ణీరే, శోరే" అని ఈనామ, జపం, వలన, వస్త్రాలు, చల్లటి నీరు, అన్నం అన్నింటినీ ఇస్తుంది. కనుక పదే పదే జపించు అంటారు. అనగానే క్షత్ర బంధు ఓ ఋషీ! ఈ చెడు స్వభావం నాతో పుట్టింది. అది నన్ను విడువదు. నేను మంచిగా మారే ప్రసక్తే లేదు అంటాడు క్షత్ర బంధు. కానీ ఋషి వదిలి పెట్టలేదు. "ద్రౌపదీ దేవికి ఈ గోవింద నామం రక్షణ కలిగించినది. నీవు మారిపోవలసిన పని లేదు. నీవుచేసే పని మంచి పనైనా, చెడు పనికయినా సరే ముందుగా గోవింద నామం జపించు! అంటాడు. ఆరోజుమొదలు, క్షత్రబంధు నిరంతరం గోవింద నామం జపించుట ప్రారంభించాడు. గోవింద నామ స్మరణ వలన, పరమ భక్తుడుగా మారిపోయి మరణించాడు. పరమాత్మ పాదాలను పొంది తిరిగి బ్రాహ్మణునిగా జన్మించి, మూడు అక్షరాలతో ముక్తిని పొందాడు క్షత్ర బంధు.

మనఆళ్వార్లలో తొండరప్పడి ఆళ్వార్ వారియొక్క తిరుమాలై ప్రబంధములో నాల్గవ పాశురమున "మొయిత్త వల్వినై యిన్ను" అనే పాశురం లో క్షత్ర బంధువును గురించి అనేక జన్మలు ఎత్తిఅనుభవించినా నశించని పాపాత్ముడు క్షత్ర బంధు అని, మూడక్షరముల గోవిందా అను నామోచ్చారణ చేత పరమ పథమును అనాయసముగా పొందాడు. అంటూ, హృదయంతో గాకున్నా, వాక్కుతోనైనా గోవింద నామం అనుసంధించు వారిని రంగనాథుడు దాసులుగా కనికరించి వాని కోర్కెలు తీర్చుతాడు (మిగతా 26 వ పేజీలో)

# సాహితీ సౌరభం

# సంస్కృత సాహిత్యంలో ఆణిముత్యాలు



తం సన్తః శ్రోతు మర్హన్తి
సదసద్వ్యక్తి హేతవః।
హేమ్నః సంలక్ష్యతే హ్యగ్నౌ
విశుద్ధిః శ్యామికాపివా॥ (రఘువంశం )

భావము: మహాకావ్యమును వినుటకు కావ్య గుణ దోషములను చక్కగా నిరూపించగల సహృదయులైన విద్వాంసులే అర్హులు. బంగారము యొక్క స్వచ్ఛతను గాని మాలిన్యమును గాని స్పష్టము చేయునది అగ్నియే కదా!

విశేషాంశము: కవికృత కావ్యము బంగారముతోను విద్వాంసుల నిశిత పరిశీలనా శక్తి అగ్నితోను పోల్చబడినది.

కావ్యము కథాపరముగా ఎంత విశిష్టమైనదైనను వ్రాసిన తీరు ఎట్టిదైనను కవి ఎంత గొప్పవాడైనను కావ్యము పండితులకు వినిపించ బడవలసినదే! ప్రాచీన కాలమున సభల యందు కావ్యములను వినిపించు సాంప్రదాయం ఉన్నట్లు చరిత్ర చెప్పుచున్నది. కావ్యమును వినిపించుటకు కవి లేదా అభిమాని సిద్ధమైనపుడు వినుటకు సిద్ధమైన వారెలా ఉండాలి. కావ్యగత గుణ దోషములను పక్షపాతరహితముగా సహృదయతతో విమర్శించి చెప్పువారై ఉండాలి. అగ్ని జ్వలనశీలమై ఉండాలి. బంగారం పుటం పెట్టేవాడు సమర్థుడై ఉండాలి. అప్పుడే బంగారము మాలిన్యము విడిచి స్వచ్ఛతతో ప్రకాశిస్తుంది. నిజమైన విలువను సంపాదించుకుంటుంది. దీనికి నిదర్శనంగా ఒక ఐతిహ్యము.

భవభూతి తాను వ్రాసిన ఉత్తర రామ చరితం అనే నాటకాన్ని కాళిదాసుకు వినిపిస్తున్నాడు. సీతారాముల సంభాషణ సన్నివేశమును వర్ణించే చోట "అవిదిత గత యామా రాత్రి 'రేవం' వ్యరం సీత" ( 1ఉ 27) అని భవభూతి చదవగా పూర్ణ బిందువు (సున్న) అధికమైనట్లుంది అన్నాడట! వెంటనే భవభూతి "రాత్రి 'రేవ' వ్యరం సీత" అన్నాడట! దాంతో రాత్రి మాత్రమే గడిచినది సీతారాముల ప్రీతి పూర్వక సంభాషణ ఇంకా పూర్తికాలేదు అది అనంతము అనే విశిష్టతమ అర్థం ద్యోతకమైనది. కవి తను కానీ, కావ్యమును కానీ, రచన ఏదైనా కానీ సహృదయుడైన విద్వాంసునకు వినిపించి సరిదిద్దుకొనుట ఉత్తమ లక్షణము.


ఆకార సదృశ ప్రజ్ఞః
ప్రజ్ఞయా సదృశాగమః।
ఆగమై స్సదృశారంభః
ఆరంభ స్సదృశోదయః॥

**శ్రీమాన్ శ్రీ డా.కె.కోదండరామాచార్యులు, ఖమ్మం**

భావము: దిలీపుడు సుందరమైన ఆకారము కలవాడు. దానికి తగిన ప్రజ్ఞ కలవాడు. ఆ ప్రజ్ఞకు తగిన శాస్త్ర జ్ఞానమును సంపాదించుకున్న వాడు శాస్త్ర జ్ఞానమును అనుసరించి తగిన కర్మల నాచరించువాడు కర్మను శ్రద్ధగా ఆచరించి దానికి తగిన ఫలమును పొందెడి వాడు.

విశేషాంశము: రూపము భగవంతుడు వొసగి నట్టిది కానీ దానికి తగిన ప్రజ్ఞ, (ప్రకర్షేణ జానాతీతి ) ఉండాలి. లౌకిక వ్యవహార జ్ఞానమును సంపాదించుకొనుట, ప్రజ్ఞ కలిగి ఉండగానే ప్రయోజనం కాదు. అవసరమైనచో తగిన ఆధారములను చూపగల శాస్త్ర జ్ఞానము అవసరము. రూపము, లౌకిక జ్ఞానము, శాస్త్ర పాండిత్యము ఇవన్నీ ఉండగానే సరికాదు. వానితో పాటు శాస్త్ర సమ్మతమైన కర్మను చేయు దీక్షతను కలిగి ఉండవలెను. కార్యమును ప్రారంభించి మాంధ్యములవలే మధ్యనే విడుచుట కాదు. ఉత్తముల వలె సత్ఫల సిద్ధికై యత్నించవలెను. అప్పుడే అతడు ఉత్తమ వ్యక్తి అగును. మనిషికి జన్మతోపాటే పంచప్రాణాలు తోడుగా ఉంటాయి. వ్యక్తికి వయసు పెరుగుతున్నప్పుడే ఈ క్రింద పేర్కొనబడిన ఐదు లక్షణములను కూడా తోడునీడగా చేసుకొని జీవించవలెను. ఉన్నంతలో రూపమును అందముగా తీర్చిదిద్దుకొనుట, తగిన లౌకిక వ్యవహార జ్ఞానము, దీనికి తోడు శాస్త్ర పరిజ్ఞానము, సంకల్పించిన సత్కర్మను ఆచరించు దక్షత, ఫలసిద్ధికై ప్రయత్నం. వీటిని స్వతహాగా సంపాదించుకున్న మనిషి సమాజంలో ఉత్తమ వ్యక్తిగా కీర్తి ప్రతిష్ఠలను పొందును.

# ఉత్తరాయణం – ధనుర్మాసము



**శ్రీమాన్ శ్రీ చించాపట్ల జగన్మోహనాచార్యులు**

సూర్యుడు అన్ని రాశుల్లో సంచరిస్తున్న గమనంలో ధనుర్ రాశిలో ఉండే కాలం, మరియు ఉత్తరాయణ ప్రవేశ కాలం భగవదారాధనలకు అత్యంత పవిత్ర కాలంగా చెప్పబడింది.

భూమి సూర్యునిచుట్టు పరిభ్రమించుచుండును. కాని మనకు సూర్యుడు తిరుగుచున్నట్లు కనిపించును. భూమియొక్క పరిభ్రమణము మూలముగా కనిపించు సూర్యుని స్థానమాధారముగ కాలగణన చేస్తాము. కావున కాలగణన విషయంలో సూర్యగమనమనే పదాన్నే ఉపయోగిస్తాము.

దీర్ఘవృత్తాకార సూర్యగమన మార్గమున 12 స్థానములను గుర్తించి వానికి రాశులు అని పేరును పెట్టారు. సూర్యుడు ధనుస్సు రాశిలో ఉండు కాలాన్ని ధనుర్మాసము అని అంటాము.

ఒక పరిభ్రమణమునకు పట్టుకాలము ఒకసంవత్సరము. మన ఒకసంవత్సరకాలము దేవతలకు ఒకదినము దేవతల దినమునకు ఉదయకాలము సూర్యుడు మకరరాశిలోనికి ప్రవేశించిన సమయము ఉత్తరాయణము. మకరరాశి కన్న ముందున్న రాశి ధనుస్సు. సూర్యుడు ధనుస్సులోనున్న కాలము ధనుర్మాసము. అనగా దేవతల దినమునకు బ్రాహ్మీముహూర్తము వంటిది ధనుర్మాసము. ఈ కాలము సత్వగుణ ప్రధానకాలము. కావున "తస్మాత్సర్వప్రయత్నేన" అనగా తప్పకుండా విష్ణువును ఉషఃకాలములో అర్చించాలి.

ఈ మాసములో విష్ణ్వర్చన విశేష ఫలమును ఇస్తుంది. కావున దీనిని వ్రతరూపమున ఆచరించాలని పురాణములలో చెప్పబడింది.

ఆ విధానమే కథావస్తువుగా, వ్రతముగా ఆచరించుటకు అనువుగా గలిగినది మార్గళి వైభవము. దానిని వివరించుటతోనే ప్రారంభమైన దివ్యప్రబంధము తిరుప్పావై కావున ఆచార్యులచే ధనుర్మాసమున తిరుప్పావై అనుసంధానమును వ్రతరూపము గా చేయాలని (ప్రపన్నులకు) విధించబడింది.

సూర్యోదయమునకు ముందే గృహములలో స్వామికి తిరువారాధన సమర్పించాలి. వరసగా ఒక్కొక్కరోజు ఒకపాశురమును (ఆనాటి పాశురమును) స్వామికి విన్నవించుకోవాలి. సమయానుకూలముగా ఆనాటి పాశుర విశేషార్థములను ఆచార్యులద్వార వినాలి.

విశేషంగా తిరుప్పావై అర్థానుసంధానమే విధింపబడుటకు కారణము ఏమనగా తిరుప్పావై "వేదమనైత్తుక్కుమ్ విత్తాగుమ్" అగుటవలన. అనగా ఈ ముప్పై రోజులలో ముప్పై పాశుర అర్థ విశేషాలను తెలిసికుంటే తెలియదగిన విషయలన్ని తెలుసుకొన్నవారవుతారు. శ్రీభాగవతమందు ఇలా చెప్పబడింది.

**కోదణ్డస్థే సవితరి ప్రత్యూషః పూజనాత్ హరేః।**
**సహస్రాబ్దార్చనఫలం దినేనైకేన లభ్యతే॥**

ఇట్లు ఈ ధనుర్మాసంలో వ్రతముగా తిరుప్పావైతో కూడిన విష్ణ్వర్చన శ్రేయోదాయకమైనది.

వైఖానసమందు ఇలా చెప్పబడినది.

**బ్రాహ్మే ముహూర్తే సంప్రాప్తే రవౌ ధనుషి సంస్థితే**
**స్నానం కృత్వా నృసూక్తేన షోడ శైరుపచారకైః।**
**నగర గ్రామ రక్షార్థ మర్చయిత్వా శ్రియఃపతిమ్**
**సహస్రవర్షకీపూజ దినే నేకైన లభ్యతే॥**

ధనుర్మాసము దేవతలకు బ్రహ్మీ ముహూర్తం కనుక ఉదయాత్పూర్వమే మేల్కొని మహావిష్ణు ఆరాధన, మార్గళి వ్రతం చేస్తే సకల శుభప్రదం! అందువలన తిరుప్పావై వ్రతమాచరించి తరిద్దాం!



# శ్రీరామాయణంలో ఉపకథలు

# శంబూక వధ



**శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం**

**వేద వేద్యే పరే పుంసి జాతే దశరథత్మజే।**
**వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా॥**

శ్రీరాముడి గురించి తెలుసుకోవాలంటే వాల్మీకి రామాయణంలో ఏం రాశారో తెలుసుకోవాలి. అందుకే వాల్మీకి రామాయణాన్ని చదివి, అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. ఇంకొకటి రామాయణం త్రేతాయుగంలో జరిగిన కథ, మనం కలియుగంలో ఉన్నాం. అప్పటికి ఇప్పటికి కులవ్యవస్థలోను, ఆచారవ్యవహారాలలోనూ ధర్మాచరణలోను అనేక తేడాలున్నాయి అని దృష్టిలో పెట్టుకోవాలి.

శంబూక వధ గురించి ఉత్తరకాండ లో 74, 75, 76 వ సర్గలలో సమగ్ర వివరణ ఉంది.

శ్రీ రాముడు తన రాజ్యాన్ని ధర్మ యుక్తంగా పరిపాలిస్తున్న సమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు నిండా 14 సంవత్సరాలు కూడా నిండని తన కుమారుడు అకాల మృత్యువుకి లోనయ్యాడని, ఆ పిల్లవాడి కళేబరాన్ని తీసుకు వచ్చి రాముడికి చూపించి దుఃఖిస్తూ రాముడితో ఇలా చెప్పాడు.

కోసల రాజ్యంలో ఇలా అకాల మృత్యువు పాల పడినట్టు ఇప్పటి దాకా వినలేదు. నేను ధర్మం తప్పక నా కర్తవ్యాలను నెరవేరుస్తున్నాను. ఏ కారణంగా నా కుమారుడు ఇలా అ కాలంలో మరణించాడు? మహారాజా ఇతర దేశాల్లో బాలురకు ఈ మృత్యు భయం లేదు. ఇక్కడ మాత్రమే ఇలా జరిగిందంటే నీ దోషం కూడా ఉంది అని రాముడిని నిలదీశాడు. ఇంకా నీ ఈ రాజ్యంలో నీ దృష్టికి రాకుండా ఎక్కడో అధర్మం జరిగి ఉండవచ్చు, కాబట్టి నీవు ఆ అధర్మాన్ని నిర్మూలిస్తే ఇది కేవలం అకాల మృత్యువు కనుక నా పుత్రుడు తిరిగి బ్రతుకుతాడు. నీవు ఈ పని చేయకపోతే నేను, నా భార్య ఇక్కడే ప్రాణ త్యాగం చేస్తామని ఆ వృద్ధుడు విలపించాడు.

ఆనాటి యుగ ధర్మం ప్రకారం ఒక రాజు ధర్మ పరిపాలన చేస్తే ఆ రాజ్యంలో అకాల మరణాలు ఉండవు. ఒకవేళ సంభవిస్తే ఆ రాజ్యంలో ఎక్కడో అధర్మం జరిగిందని అర్థం. వెంటనే రాముడు మంత్రులను, వశిష్ఠవామదేవాది బ్రాహ్మణులను, పుర ప్రముఖులను, తన సోదరులను పిలిచి ఈ విషయం మీద చర్చించాడు.

అప్పుడు నారద మహర్షి అక్కడకు వచ్చి ఈ బాలుడికి అకాల మృత్యువు బారిన పడటానికి కారణం ఏమిటో వివరించాడు.

"కృత యుగములో కేవలం బ్రాహ్మణులు మాత్రమే తపస్సులను ఆచరించడానికి యోగ్యులు, వారికి మాత్రమే ఉపదేశం ఉంటుంది. ఇతర మూడు వర్ణాల వారికి ఆ అర్హత ఉండదు.

త్రేతాయుగములో బ్రాహ్మణులతో పాటు క్షత్రియులు కూడా తపశ్చర్యకి యోగ్యులే అవడంతో ఆ ఇరు వర్ణాల వారూ సమానులుగా ఉంటారు. ఈ యుగంలో, ఇతర వర్ణాల వారికి తపస్సు చేయుటకు అనుమతి, ఉపదేశం ఉండదు.

ద్వాపర యుగములో బ్రాహ్మణ క్షత్రియులతో పాటు వైశ్యులకు కూడా తపస్సు చేసే అర్హత ఉంటుంది.

**భవిష్యచ్ఛూద్రయోన్యాం వై తపశ్చర్యా కలౌ యుగే।**
**అధర్మః పరమో రాజన్ ద్వాపరే శూద్ర జన్మనః॥**

(ఉత్తరకాండ 74 వ సర్గ 27వ శ్లోకం)

అనగా ద్వాపర యుగము అంతకు ముందు యుగములలో యుగధర్మాలు అనుసరించి శూద్ర వర్ణం వాళ్ళకు తపస్సు చేయడానికి అధికారం లేదు. కానీ కలియుగంలో శూద్రులకు కూడా తపస్సు చేసే అధికారం ఉంటుంది. అందరూ సమానంగా చూడబడతారు. కాబట్టి యుగధర్మాలు ఆచరించి నీ రాజ్యము అంతా సంచరించి ఎవరైనా అధర్మమును ఆచరిస్తూ ఉంటే ఒక రాజుగా వారిని సంహరించి ధర్మమును నిలబెట్టు. తద్వారా అకాలమృత్యువు బారిన పడిన బాలుడు పునర్జీవితుడు కాగలడు. అని నారద మహర్షి చెప్పారు. ఇంకా దేశంలో అధర్మానికి, అకృత్యానికి ఒకడు పాల్పడితే ఆ దేశంలో లక్ష్మి నిలవదు. ఆ పాపుడు కూడా నరకాన పడతాడు.

ధర్మబద్ధంగా పరిపాలించే రాజుకు ఆ దేశంలో బ్రాహ్మణులు

చేసే వేదాధ్యయనం, తపస్సు, సుకృత్యాలు, పుణ్యకర్మలలో 6 వ భాగం వచ్చి చేరుతుంది. అందువలన రాజు ప్రజలను తప్పక రక్షించాలి.

అది విన్న రాముడు పుష్పక విమానం ఎక్కి తన రాజ్యంలో అన్ని దిక్కులా వెతికాడు. ఆఖరికి దక్షిణ దిశలో ఉత్తరభాగంలో ఒకడు అధోముఖంగా వేలాడుతూ తీవ్రంగా తపస్సు చేస్తుండడం రాముడు చూశాడు. “ఓ వ్రత నిష్ఠాగరిష్ఠుడా నీవు ఎంత ధన్యుడవు. తపస్వీ నీ జన్మ ఎలాంటిది? నీ శక్తి సామర్థ్యాలు దృఢమైనవి. కావున కుతూహలంతో ఈ విధంగా అడుగుతున్నాను. నేను దశరథ కుమారుడైన శ్రీ రాముడిని. నీవు ఈ ఘోర తపస్సు ఎందుకు చేస్తున్నావు? నీకు కావలసిన వరమేమిటి? స్వర్గ భోగములు కావాలా, లేక వాటికి మించినవా చెప్పు ” అని అడిగాడు..

దానికి శంబూకుడు “శ్రీరామా నేను శూద్రుడను నా పేరు శంబూకుడు. ఈ శరీరంతో దివ్యత్వాన్ని పొందాలని కోరుకుంటున్నాను. నేను దేవలోకాన్ని జయించాలని ఈ ఉగ్రమైన తపస్సును చేస్తున్నాను. నా మాటలు నిజము” అని చెప్పాడు. శ్రీరాముడు వెంటనే అతడిని వధించాడు. అన్న కథ వరకు మనకు తెలుసు.

ఇక్కడ ముఖ్యంగా గ్రహించ వలసినవి కొన్ని ఉన్నాయి :

1. ఆ యుగంలో వాళ్ళు ఇలాంటి ఉగ్రతపస్సు చేయడం వలన ధర్మానికి హాని కలుగుతుంది కనుక, ఆ యుగధర్మం ప్రకారం అది అంగీకార యోగ్యమే అనేది ఒక కారణం.

2. ఈ శరీరంతో ఊర్ధ్వలోకాలకు వెళ్లాలని ప్రయత్నించడం తప్పు. అది ఎవరికి సాధ్యం కాదు, ధర్మ విరుద్ధం. అది ప్రకృతి నియమం. ఈ జన్మలో చేసిన తపస్సు, యజ్ఞం, లేక ఇతర పుణ్యకార్యాల వలన వచ్చిన పుణ్యంతో మరణానంతరం మాత్రమే స్వర్గానికి వెళ్లగలరు. ఈ ప్రకృతి నియమాన్ని భంగం చేస్తూ శంబూకుడు తపస్సు చేయడం హానికరం. అందుకే అకాల మరణం వంటి ఉత్పాతాలు జరిగాయి. వాటిని ఆపడం కోసం మాత్రమే శంబూకుడిని వధించవలసి వచ్చింది.

ఇక్కడ శూద్రుడైన శంబూకుడు ఆ యుగధర్మానికి విరుద్ధముగా తపస్సు చేయడం వలన వధ జరిగింది, కానీ కేవలం శూద్రుడు కావడం చేత కాదు. రామ రాజ్యంలో ధర్మబద్ధంగా ఉన్న శూద్ర వర్ణం వారు అందరూ ఎంతో సుఖసంతోషాలతో ఉన్నారు అనే శ్లోకాలు రామాయణంలో అనేకం ఉన్నాయి. (సశేషం)

# క్షత్ర బంధుడు

(22 వ పేజీ తరువాయి) అంటారు ఆళ్వార్లు. ఈమె చెప్పిన,ఈ విషయం హరివంశములో ఉన్నదట!

పెణ్ పిళ్లై గారు శత్ర బంధువు వలె నిరంతరం నేను గోవింద నామ స్మరణ చెయ్యలేదు కదా. మరి ఏ యోగ్యత ఉందని నేను ఈ తిరుక్కోళూరిలో ఉండగలను అన్నది. హరి వంశంలో గల ఈ విషయం రామానుజుల వద్ద ఆమెగారు నివేదన చేస్తుంటే, ఈమె ఎంతటి భాగవతోత్తమురాలు! అని ఆమెను చూచినందుకు ఎంతో ఆనందించారట!

# జ్యోతిర్విజ్ఞానమ్

(20 వ పేజీ తరువాయి) కొమ్మలు రెమ్మలు వ్రేళ్ళు ఇత్యాదులన్నీ ఇస్తుంది. పువ్వుల ద్వారా భగవంతుని పూజ, ఫలం ద్వారా భగవన్నివేదనం. మనం ఆరగించటం ద్వారాశక్తి, పుష్పములద్వారా సుగంధ లేపనములు, సుగంధ పరిమళం చేత ఆహ్లాదం పొందుట, ఇత్యాది ప్రయోజనాలు పొందుతాము.

వాస్తుశాస్త్రంలో అలంకారవాస్తు గురించి తెలుసు కొంటున్నాము మరికొన్ని అంశాలు తదుపరి సంచికలో తెలుసుకుందాము.

**(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)**




# శ్రద్ధాంజలి

శ్రీసన్నిధానం గౌరవ సంపాదకులు, వ్యాసకర్తలు శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనరసింహాచార్యులు గారి సహధర్మచారిణి విజయశ్రీ అమ్మగారికి శ్రీసన్నిధానం శ్రద్ధాంజలి ఘటిస్తూ నివాళులు అర్పిస్తున్నది.

# జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?

## లేక పరమాత్మే జీవుడిచేత అన్నికర్మలనీ చేయిస్తాడా?

(శ్రీమాన్ పుత్తూర్ కృష్ణమాచార్యస్వామివారి వ్యాఖ్యానానుసారంగా చెప్పబడినది)



**శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు**

**ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥**

(18-61) అర్జునా! అందరినీ నియమించే వాసుదేవుడు అన్నిజీవరాసుల హృదయంలో ఉండే వాడినై దేహం ఇంద్రియం మొదలైన స్థితిలో నున్న ప్రకృతియైన యంత్రం మీద అధిరోహించి ఉండే అన్ని జీవరాసులనీ తన సత్త్వాది గుణాలైన మాయచేతనే ఆయా గుణాలకి అనుగుణంగా నడిపించుతూ యుంటున్నాడు అని ఈ విషయం ఇక ముందు కూడా చెప్పబడుతుంది. ఇక ఈ విషయంలో ఒక ఆక్షేపం ఇలా వస్తున్నది. "స్వతంత్రః కర్తా" (అష్టాధ్యాయి 1-4-54) అని పని చేసే కర్తకి స్వాతంత్ర్యం లక్షణంగా చెప్పబడుతున్నది. ఈ శ్లోకంలోకూడా కర్త అని జీవుడే చెప్పబడుతున్నాడు. ఒక పని ఉండటానికి కారకాలు 1. కర్తృకారకం, 2. కర్మకారకం, 3.కరణకారకం, 4. సంప్రదానకారకం, 5. అపాదానకారకం 6. అధికరణకారకం అని ఆరువిధాలైనవిగా ఉన్నాయి.

దైవం మిగతా అయిదు కారకాలనీ నడిపించేదై తనని నడిపించే మరొక కారకం లేనిదై అంగీకరించబడుతున్నది. కనుక పనికి కారకంగా ఇక్కడ చెప్పబడే దైవమూ అధిష్ఠానమైన శరీరం, కరణమైన ఇంద్రియాలూ, ప్రాణమనే మిగతా కారకాలలాగ కర్తయైన కారకుడికి లొంగినదొక కారకుడిగా గ్రహించబడవలెనన్నది ఆ ఆక్షేపం. దీనికి సమాధానం "జానాతి, ఇచ్ఛతి, యతతే" అనే రీతిలో మొదట ఒక పనినిగురించిన జ్ఞానం ఉండి, తరువాత ఆ పనిమీద ఇష్టముండి, దాన్ని ప్రయత్నించే పురుషుడైన కర్తృకారకుడికే మిగతా కారకాలని నడిపించటంగా ఉంటుంది. తనకి ఒక కారకుడు లేకుండా ఉండటమనే గొప్పతనాలు అంగీకరించబడుతున్నాయి. ఆ జ్ఞానం, ఇష్టం, ప్రయత్నం అనేవి కలగటమే పరమాత్మకి అధీనమైనది అని వేదవాక్యములనుండి స్పష్టమౌతున్నాయి. గనుక జీవుడు పరమాత్మకి అధీనమైయుండే కర్తగా ఉంటాడు అనిన్నీ, మిగతా కారకాలని నడిపించేదిగా ఉండటం, తనకి ఒక కారకుడనేవాడు లేకపోవటం అనే గొప్పతనాలు అంగీకరించబడుతున్నాయి. ఆ తెలివి, ఇచ్ఛ, ప్రయత్నం అనేవాటిని కలిగించటమే పరమాత్మయొక్క అధీనమైనది అని వేదవాక్యాలనుండి స్పష్టమవటంచేత జీవుడు పరమాత్మకి లొంగినవాడై కర్తగా ఉంటున్నాడు అనిన్నీ, మిగతా కారకాలని గురించి స్వతంత్రుడుగా నున్నాడనిన్నీ ఒకదానితోనొకటి వ్యతిరేకించవని "పరాత్తు తచ్ఛ్రుతేః" (2-3-40) (జీవుడి ఆ కర్తృత్వము పరమాత్మచేతనే కలుగుచున్నది. శ్రుతి ఆవిధముగా చెప్పుటచేత) అనే బ్రహ్మసూత్రంలో నిర్ణయించబడింది. జ్ఞాన. ఇచ్ఛా ప్రయత్నాల ఉత్పత్తి పరమాత్మ చేతనే కావటంచేత అతడికి అధీనమవటమే "జీవుడి కర్తృత్వం" అన్నమాట. దీనిమీద మరొక ఆక్షేపం వస్తే దానికి బ్రహ్మసూత్రకారులు తరువాతి సూత్రంలో సమాధానం చెప్తున్నారు.

ఆ ఆక్షేపం జీవాత్మయొక్క కర్తృత్వంకూడా పరమాత్మాధీనమైనదైతే, ఆ జీవుడినిగురించి శాస్త్రాలు "ఇది చెయ్యి, అది చెయ్యి" విధించటమూ, "ఇది చెయ్యకూడదు, అది చెయ్యకూడదు" అంటూ నిషేధించటమూ అర్థం లేనిదే. ఎవడు స్వతంత్రంగా ఒక పనిని చెయ్యగలడో, లేక ఒక పనినుంచి విరమించుకొనగలడో వాడిగురించి విధించటమో నిషేధించటమో కుదురుతుంది. ఇక్కడ జీవుడు పరమాత్మచేత నిలపెట్టబడి కార్యాలని చేస్తున్నాడు గనుకవాడిని గురించి శాస్త్రం విధి, నిషేధాలని చెయ్యటం కుదరదు. అంతేకాదు, పరమాత్మే ఒకడిని తప్పుపనులని చేసేటట్లు నిలబెట్టి, వాడిమీద కోపం తెచ్చుకొని, వాడిని దండించటమూ, ఆ పరమాత్మే మరొకడిని పుణ్యకార్యాలు చేసేటట్లు చేసి, వాడిమీద ప్రీతితో వాడికి సుఖాన్ని కలిగించటమూ పరమాత్మకి పక్షపాతం, కరుణారాహిత్యం మొదలైన. దోషాలనెన్నింటినో కలిగిస్తుంది. (సశేషం)

శ్రీసంప్రదాయ సేవలో

# ఆళ్వారాచార్య సేవా సమితి

"ఆళ్వార్ ఆచార్య సేవా సమితి" డిసెంబర్ 2023 లో 10 మంది సభ్యులుగా రూప కల్పన చేయబడి స్థాపించబడింది. శ్రీమత్తిరుమల పెద్దింటి భాస్కరాచార్యులు (యస్.టి.పి.భాస్కర్) గారి నేతృత్వంలో వారు ప్రధాన కార్యదర్శిగా, శ్రీమాన్ మారింగంటి రామ్మోహనాచార్యులు అధ్యక్షులుగా ఈ సంస్థ ఏర్పాటు చేయబడింది. శ్రీరామానుజ సిద్ధాంత ప్రచారము, ముఖ్యంగా శాస్త్ర విహితమైన భగవదారాధనలు, హోమాలు, పర్వదినాలు తిర్నక్షత్రోత్సవాలు సామాజికులందరితో కలసి వైభవంగా నిర్వహించుట లక్ష్యంగా స్థాపించ బడినది.




అనగా శ్రీ రామానుజ సిద్ధాంతమ ననుసరించి భగవంతుని సేవలో, ధార్మిక జీవిత విధానంలో వర్ణ భేదాలు ధనిక పేద భేదాలు లేవు. అట్లే సర్వ మానవ సమానత్వమును ధ్యేయంగా ఈ సంస్థ స్థాపించబడినది. మన పెద్దలు ఆళ్వారులు, ఆచార్యులు రూపొందించిన ఆచార్య ధార్మిక సంప్రదాయాన్ని సదా కొన సాగించేలా కార్యక్రమాలు నిర్వహించటమే ప్రధాన లక్ష్యం. భక్తి మార్గంతో ముందుకు సాగడము, పురాతన ఆలయాలకు చేయూత నిచ్చుట, అదే మార్గంలో సమాజంలో చైతన్యాన్ని కలిగించి, సత్ సంప్రదాయాన్ని ప్రచారం చేసే దిశగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది ఆళ్వారాచార్య సేవా సమితి.

జగత్ కళ్యాణము కొరకు, సమాజశ్రేయస్సు కొరకు, మరియు మన ఆళ్వారాచార్యుల పరంపర మనకందించిన సంప్రదాయ ఆచారణములను, వారి శ్రీసూక్తులను ప్రచారము చేయుట, భక్తుల సహకారముతో గ్రామాలలో పట్టణాలలో పురాతన ఆలయములలో హోమ, జప, పారాయణ, ప్రవచన కార్యక్రమములను ఏర్పాటు చేయుట, ధర్మమును కాపాడుటకై ప్రేరేపించు కార్యక్రమములను నిర్వహిస్తూ సంస్థ ముందుకు అడుగు వేయటం జరుగుతున్నది.

మణికొండలో గల పూరాతన అనంత పద్మనాభ స్వామి ఆలయం నుండి కార్యక్రమములు, తెలంగాణలోని పురాతన దేవాలయాలలో పలుచోట్ల తిరునక్షత్ర ఉత్సవములు మరియు సుదర్శన హోమములు ఇత్యాదులు నిర్వహించటం జరుగుతున్నది.

కార్య క్రమములు నిర్వహించిన ప్రదేశములు.

అనంత పద్మనాభ స్వామి దేవాలయం, మణికొండ,హైదరాబాద్.

2. మహబూబ్నగర్ జిల్లా వెలిజాల గ్రామంలోని 400 సంవత్సరముల వెంకటేశ్వర స్వామి ఆలయంలో సుదర్శన హోమం.

3. షాద్‌నగర్‌కు 18 కిలో మీటర్ల దూరంలో గల 800 సంవత్సరముల పురాతన శ్రీరంగనాథస్వామి ఆలయంలో సుదర్శన హోమం. పెరియాళ్వార్ తిరు నక్షత్రం.

మే 5 2024 నాడు హయత్నగర్, హైద్రాబాద్ శివారులో





గల సాహెబ్ నగర్ లో 1000 సంవత్సరముల పురాతన ఆంజనేయ స్వామి ఆలయనకు దగ్గర గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో సుదర్శన నారసింహ హోమం.

వనస్థలిపురం రెడ్ ట్యాంక్ దగ్గర గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆచార్య తిరునక్షత్రం.

17 అక్టోబర్2024 నుండి 20 అక్టోబర్ 2024 వరకు 800 సంవత్సరముల పురాతన మత్సరూప వెంకటేశ్వర స్వామి ఆలయం జిల్లెల్లగూడా హైదరాబాద్ నందు 4 రోజులు దివ్యప్రబంధ గోష్టి, 28 కుండాలతో సుదర్శన నారసింహ హోమము. శ్రీ తిరుమల వింజమూరి శరత్ చంద్రస్వామి యజ్ఞ ఆచార్యులు వారి ఆధ్వర్యములో జరపబడ్డాయి. ఈ కార్యక్రమంలో అహోబిల జీయర్ స్వామి, శ్రీరంగం ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

ఇదేవిధంగా అనేక ప్రాంతాల్లో భగవద్విశ్వాసాన్ని పెంపొందిస్తూ ఎన్నో ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆరాధనలు నిర్వహిస్తున్నది. ఆళ్వారాచార్య సేవా సమితి. ★







## ద్వాదశ సూరి వైభవ ప్రవచన కార్యక్రమము

ద్వాదశ సూరి (ఆళ్వార్ల) వైభవ ప్రవచన కార్యక్రమములు మరియు పుస్తక ఆవిష్కరణము శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయ, కళ్యాణ మండపం, ఖమ్మంలో నవంబర్ 08, 09, 10 తేదీలలో అత్యంత వైభవంగా జరిగాయి. వేదావధాని, శ్రీ పాంచరాత్రాగమ శాస్త్ర విద్వన్మణి శ్రీమాన్ డా॥ కండ్లకుంట కోదండరామాచార్యులు గారి సలహా మరియు నిర్వాహణలో జరిగిన ఈ సభలకు వివిధ ప్రాంతల నుండి వచ్చిన ఉభయ వేదాంత పండితుల ప్రవచనములు సభికులను మంత్రముగ్ధులను చేశాయి.









# ఋషి వాక్య ప్రబోధాలు



శ్లో॥ పరవస్త్రం చ పాత్రంచ
పరయానం పరస్త్రియః।
పరవేశ్మ నివాసశ్చ
శక్రస్యాపి శ్రియా హరేత్॥

(శంఖ లిఖిత ధర్మశాస్త్రము నుండి.)

ఇతరులు విడచిన వస్త్రాన్ని అట్లే వారు ఉపయోగించిన పాత్రలుగాని, ఇతరులువాడే వాహనాన్ని గాని, ఇతర స్త్రీలనుగాని ఎవరు అనుభవించెదరో అట్లే పరాయి ఇండ్లలో ఎవరు బతుకు సాగిస్తున్నారో వారు, ఎంతటి ఇంద్రపదవిలో ఉన్నావారైనా వారి సమస్త సంపదలు నశించిపోతాయి.

శ్లో॥ దృష్టిపూతం న్యసేత్ పాదం
వస్త్రపూతం జలం పిబేత్।
సత్యపూతాం వదేత్ వాచం
మనఃపూతం సమాచరేత్॥

(శంఖధర్మశాస్త్రము)

ఓ బుద్ధిమంతుడా! నీవు వేసే ప్రతీ అడుగు చూసివేయాలి. నీవు త్రాగేనీరు వడ గట్టుకొని త్రాగాలి. అట్లే నీవు పలికే మాట సత్యమైనదిగా ఉండాలి. అంతేకాదు నువ్వు ఏపని చేసినా అది మనస్ఫూర్తిగానే చేయాలి సుమా!

శ్లో॥ హృదిస్థాః దేవతాః సర్వాః
హృది ప్రాణాః ప్రతిష్ఠితాః।
హృది జ్యోతీంషి సూర్యశ్చ
హృది సర్వం ప్రతిష్ఠితః॥

(శంఖధర్మశాస్త్రము 16 శ్లో॥)

మన హృదయంలోనే దేవతలు ఉంటారు. మన హృదయంలో ప్రాణాలు నిలచి ఉంటాయి. మన హృదయంలోనే వెలుగులు ఉన్నాయి. సూర్యభగవానుడు ఉన్నాడు, హృదయంలో లేనివి లేవు. అన్ని నీలోనే ఉన్నాయి.

## శ్రీమాన్ శ్రీ డా.యం.టి.ఆళ్వార్ స్వామి

శ్లో॥ ఉభాభ్యామపి పక్షాభ్యాం
యథా ఖే పక్షిణాం గతిః।
తథైవ జ్ఞాన కర్మాభ్యాం
ప్రాప్యతే బ్రహ్మ శాశ్వతమ్॥

ఆకాశంలో ఎగిరే పక్షికి రెండు రెక్కలు ఎంత అవసరమో. అలాగే శాశ్వత బ్రహ్మస్థానంలో పయనించాలంటే మనకు జ్ఞానము దానితోపాటు" కర్మ" (ఆచరణ) కూడా తప్పకుండా ఉండాలి.

శ్లో॥ అన్యాయేన నృపో రాష్ట్రాత్
స్వకోశం యోఽభివర్ధయేత్।
సోచిరాత్ విగత శ్రీ కో
నాశమేతి స బాంధవః॥

(యాజ్ఞవల్క్య స్మృతినుండి)

దేశాన్ని పరిపాలన చేసే రాజులు, నాయకులు అన్యాయంగా ప్రజల నుండి పన్నులు వసూలు చేసి తమ ధనాగారాలను నింపుకొనరాదు. అలా ప్రజాధనం దోచేవారు కొద్దికాలంలోనే తమ బంధువర్గముతో సహా నాశనమైపోవుదురు.

శ్లో॥ అధర్మ దండనం స్వర్గ
కీర్తిం లోకాంశ్చ నాశయేత్।
సమ్యక్తు దండనం రాజ్ఞః
స్వర్గం కీర్తిం జయావహమ్॥

రాజులు అన్యాయంగా ఎవరికైనా శిక్షలు విధిస్తే వారు కీర్తినేకాదు స్వర్గం లాంటి పుణ్యలోకాలను కోల్పోవుదురు. ఏ రాజులయితే చక్కగా విచారించి శిక్షలు అమలు పరచెదరో వారు. స్వర్గాన్ని కీర్తిని విజయాలను పొందగలరు.

# తెలుసు కోవలసినవి మూడే!



**శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు**

(క్రిందటి సంచిక తరువాయి)

ఈ ఆత్మ అణువంతయుండి శరీరములో హృదయమునందు ఉన్నప్పుడు శరీరమునందు అంతటా సుఖ దుఃఖములను అనుభవించుట ఎట్లు కుదురును? ఒకవ్యక్తి నాకు కాలివేలియందు నొప్పియని శిరసునందు నొప్పియని చెప్పుచున్నాడే మరి జీవుడు హృదయమునందున్నప్పుడు ఇది ఎట్లుకుదురునుయని ప్రశ్న. దానికి సమాధానము మణి, సూర్యుడు మరియు దీపము ఎక్కడో ఒక్కచోటయున్నప్పటికీ వాటి కాంతి అంతా వ్యాపించుటలేదా అలాగే ఈ ఆత్మ హృదయమందు ఉన్నప్పటికీ దాని జ్ఞానముద్వారా శరీరమంతయూ వ్యాపించియుండి శరీరమునందు ఏమూలను కలిగిన సుఖమునైననూ దుఃఖమునైననూ అనుభవించుచున్నది. ఇదే విషయమును బృహదారణ్య కోపనిషత్ **'ప్రజ్ఞాయా వాచం సమారుహ్య వాచా సర్వాణి నామాని ఆప్నోతి...'** జీవుడు, జ్ఞానముచేత వాగింద్రియమును చేరి వాక్కుతో అన్ని మాటలనూ పలుకుచున్నాడు' అని మొదలుపెట్టి జ్ఞానముచే ఘ్రాణేంద్రియమును పొంది సకల పరిమళములను వాసన చూచుచున్నాడు, జ్ఞానముచే చక్షురింద్రియమును చేరి అన్నిటినీ చూచుచున్నాడు, జ్ఞానముచే శ్రోత్రేంద్రియమును చేరి చెవులద్వారా అన్ని శబ్దములను వినుచున్నాడు యని వరుసగా చెప్పి చెప్పి జ్ఞానముచే శరీరమునుపొంది సుఖ దుఃఖములను పొందుచున్నాడుయని తెలిపినది. కనుక ఆత్మ హృయమునందున్నప్పటికీ శరీమునందు అంతటనూ కలిగే సుఖ దుఃఖానుభవమును చేయును అని చెప్పుట సరియైనదే యని తెలియుచున్నది.

ఇప్పుడు ప్రశ్న వచ్చుచున్నది. అది ఏమిటంటే ఒకే జీవుడు యోగశక్తిచే అనేక శరీరములను ధరించుట మనము చూచుచున్నాముకదా! ఇది స్వరూపవ్యాప్తి వలనకదా! అంటే కానేకాదు. జ్ఞానముచేతనే యని సమాధానము. స్వరూపముచే వ్యాపించినచో ఒకయోగి తన ఆరడుగుల శరీరమును వదలి ఒక చిలుక శరీరములో ప్రవేశించినచో ఆచిలుక శరీరమునకు ఆ ఆరడుగుల రూపము పట్టదుకదా! కనుక స్వరూపముతో వ్యాపించుటకుదరదు. జ్ఞానముచేతనే! వ్యాపించును.

ఆత్మ మరియొక లక్షణము ఏమంటే 'అవ్యక్తము'. అవ్యక్తముయనగా వ్యక్తము (ఇట్టిదని తెలుపుటకు) చేయుటకు సాధ్యముకానిదియని అర్థము. కుండ మొదలగు వస్తువులు మనము కంటితో చూచి తెలుసుకుంటున్నాము. అలాగ కన్ను మొదలగు ఇంద్రియములతో తెలుసుకొనుటకు సాధ్యముకాదు. అందులకే ఆత్మను అవ్యక్తముయని తెలిపిరి.

ఆత్మ మరియొక లక్షణము ఏమంటే 'అచిన్త్యము'. అచిన్త్యమనగా మనసుతో తలచుటకు సాధ్యముకానిదియని అర్థము. అనగా అచిత్తుతో సమానమైనదని తలచుటకు వీలులేనిది. ప్రకృతిలో కనబడు సకలవస్తువులకంటే వేరైనది. వాటివంటిదికాదు. ప్రకృతిలోనుండు వస్తువులవలే మన బుద్ధితో తెలుసుకొనుటకు సాధ్యముకానిది. కనుక ఆత్మ అచిన్త్యము.

అచిన్త్యమనగా మనసుతో చింతించుటకు (తలచుటకు) సాధ్యముకానిదియని అర్థము. అనగా అచిత్తుతో సమానమైనదని తలచుటకు వీలులేనిది. ఎందులకనగా ప్రకృతిలోనుండు సకలవస్తువులు ఇంద్రియములచేత తెలుసుకొనుటకు మరియు మనస్సుతో తలచుటకు వీలుగానున్నవి. కానీ ఆత్మ అలాంటిదికాదు.

ప్రకృతిలో కనబడు సకలవస్తువులకంటే వేరైనది. వాటివంటిది కానేకాదు. ఈ ఆత్మ ప్రకృతిలోనుండు వస్తువులవలే మన బుద్ధితో తెలుసుకొనుటకు సాధ్యముకానిది. కనుక ఆత్మ అచిన్త్యము.

ఈ ఆత్మ నిరవయవము అనగా అవయవములు లేనిది అని అర్థం. ఈఆత్మ విజ్ఞానమయముగానుండుటచే దీనికి ఎట్టి అవయములు ఉండవు. ఈఆత్మను అక్షరము యని అక్షర శబ్దముచే చెప్పెదరు. అక్షరము అనగా నాశము లేనిది అని అర్థం. అచిత్తు అనబడే ప్రకృతి "క్షణక్షరణ" (క్షణక్షణము మారుట) స్వభావముకలది. కనుక ఆత్మ అచిత్తువలె

మార్పును పొందక ఎప్పుడూ ఒకే రకముగానుండును. దీనినే నిర్వికారము అందురు. కృష్ణభగవానుడు భగవద్గీతలో ఈ ఆత్మను "అవికార్యోయమ్" ఈ ఆత్మ అవికారము అని తెలిపెను.

ఇట్లు అవికారముగా ఆత్మ ఉండుటచేత ఈ ఆత్మ ఖడ్గము మొదలగు శస్త్రములచేత నరుకబడదు. అగ్నిచేత కాల్చబడదు. నీటిచేత తడుపబడదు. గాలిచేత ఎండచేత ఎండింపబడదు. ఏదైనా ఒక వస్తువును నరకవలెనన్న, ఆవస్తును నరికే ఆయుధం ముందు ఆ వస్తువులోనికి దిగబడాలి. అట్లు దిగినకానీ నరకలేరు కదా! ఆత్మ అణు స్వరూపము కనుక పైనచెప్పిన శస్త్రము, అగ్ని, నీరు, వాయువు ఎండ మొదలగునవి ఈఆత్మను ఏమీ చేయలేవు. కృష్ణభగవానుడు భగవద్గీతలో

**"నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః।**
**నచైనం క్లేదయన్త్యాపో నశోషయతి మారుతః॥"** (ఈ ఆత్మ శస్త్రములచేత నరకబడదు. అగ్నిచేత కాల్చబడదు. నీటిచేత తడుపబడదు. గాలిచేత ఎండింపబడదు) అని తెలిపెను.

కానీ జైనులు ఈ ఆత్మస్వరూపము శరీరమంత ఉండును యని చెప్పిరి. అనగా ఏనుగు శరీరములో ఏనుగంత, చీమ శరీరములో చీమంత ఆత్మయుండును యని వారి ఉద్దేశ్యము. ఎందుకు అట్లు చెప్పిరి అనగా ఆత్మ అణువువలె సూక్ష్మరూపముతో హృదయమునందున్నచో కాలిలోవచ్చు నొప్పి, చేతిలో వచ్చు నొప్పి ఎట్లుతెలియును. కానీ అట్లు తెలియుచున్నవి కనుక. ఆత్మ శరీరమంత పరిమాణములో శరీరమంతా వ్యాపించియుండును అని జైనుల ఉద్దేశ్యము. కానీ ఆత్మ హృదయమునందున్నప్పటికీ జ్ఞానముద్వారా శరీరమంతయు వ్యాపించియుండుటచే తెలియును. ఒకదీపము ఎక్కడోయున్ననూ దాని కాంతి ఎట్లు ప్రసరించుచున్నదో అట్లు ఆత్మ హృదయమునందున్ననూ శరీరములో ప్రతీమూలలోయుండు నొప్పి మొదలగునవి తెలియుటలో ఎట్టి సందేహమూ లేదుకదా! కావున జైనులు చెప్పు ఆత్మ దేహపరిమాణముయను మాట సరినయైనదికాదు. అంతేకాక ఆత్మను అణుపరిమాణము అని శ్రుతి (వేదము) తెలుపుచున్నది. కావున దేహపరిమాణము అను మాట శ్రుతికి విరుద్ధము.

వారు చెప్పినది కనుక సత్యమైనచో పరకాయ ప్రవేశముద్వారా శరీరములను మార్చు యోగులయొక్క స్వరూపమునకు ఇబ్బందివచ్చును. ఎట్లనగా ఒకయోగి పరకాయ ప్రవేశ విద్యచే తన శరీమునుండి ఒక చిలుక శరీరములో ప్రవేశించాలనుకొన్నప్పుడు యోగి ఆత్మ జైనుల మతముననుసరించి యోగి శరీరమంతయుండినచో చిలుక శరీములో పట్టక ఆ చిలుక శరీరము పీలికలై పొడైపోవును కదా. అంతేకాక ఏనుగు శరీరమునుండు ఆత్మ జైన సిద్ధాంతముననుసరించి ఏనుగంతయుండును కదా, ఆ ఏనుగు మరణించిన తర్వాత ఆయేనుగునందుండు ఆత్మ కర్మానుగుణముగా చీమ శరీరము ధరించవలసి వచ్చినచో ఆ ఆత్మకు చీమ శరీరము సరిపోదు కనుక కుదరదు. అట్లే చీమ శరీరమునందుండు ఆత్మ ఏనుగు శరీరమును ధరించుట కుదరదు. కనుక వారి వాదము సరియైనది కాదు.

ఈఆత్మయొక్క మరియొక లక్షణము జ్ఞానాశ్రయము, అనగా జ్ఞానమునకు ఆశ్రయము. జ్ఞానమునకు నివాస స్థలముగానుండుట. జ్ఞానము అనునది ఒక వస్తువు నాశ్రయించియుండి తనయొక్క ఉనికిచే (తానుండుటవలన) ఈజీవుడు తనను గురించి తాను తెలుసుకొనుటకు మరియు తనగురించి తెలుపుకొనుటకు, ఇతరులను గురించి తెలుసుకొనుటకు మరియు తెలుపుటకు ఉపయోగపడు ఒకానొక ఆత్మ లక్షణము.

ఈజ్ఞానమునకు ఆత్మ ఆశ్రయముగానుండుట యనగా దీపము దానికాంతి రెండును ప్రకాశించే ద్రవ్యములైనను దీపము కాంతికి ఆశ్రయమైయుండును. అట్లే ఆత్మ జ్ఞానస్వరూపమే అయి ఉన్నప్పటికీ ఆత్మయొక్క ధర్మమైన జ్ఞానము ఆత్మకంటే వేరుగాయుండుట అనునది ఉండనేయుండదు. ఇదే విషయమును వేదముకూడా "జ్ఞానముకల పురుషుడే" ఇంద్రియములద్వారా జ్ఞానముతో విషయములను తెలుసుకొనుచున్నాడు అని తెలిపినది. దీనివలన ఆత్మయొక్క లక్షణము జ్ఞాతృత్వము (తెలుసుకొనుట) అని సిద్ధించుచున్నది.

ఈ ఆత్మ జ్ఞానమునకు స్థానముకాక జ్ఞానమే అయినచో "నేను జ్ఞానమును అని అనాలిగానీ" నేను తెలుసుకొనుచున్నాను అని అనుట కుదరదు. నేను తెలుసుకొనుచున్నాను అనే వ్యవహారమే మనకు లోకములో కనుపడుచున్నదికానీ "నేను జ్ఞానమును" అనువ్యవహారము అస్సలు కన్పించుటనే లేదు కదా! కనుక ఆత్మ జ్ఞాతా (తెలుసుకొనువాడు) మాత్రమే కానీ జ్ఞానము కాదు.

(మిగతా వచ్చే సంచికలో తెలుసుకుందాము) ★

# శిల్ప కళా నిలయం ఖిల్లా రామాలయం








భారతీయ చరిత్ర వైభవానికి ఆనవాళ్ళు ప్రాచీన కట్టడాలు. ప్రధానంగా దేవాలయాలు దైవీ శక్తికి నిలయాలే కాకుండా సంస్కృతిని ప్రతిబింబించే నిలువెత్తు నిదర్శనాలు. కాని అటువంటి ప్రసిద్ధ దేవాలయాలు విధ్వంసాలనుండి, నిర్లక్ష్యమునుండి రక్షించ బడి నేటికీ నిలిచి ఉన్న వందల ఏండ్ల క్రిందటి దేవాలయం "ఖిల్లా రామాలయం' (డిచ్పెల్లి నిజామాబాద్) కాకతీయుల కాలం నాటి ఈ దేవాలయం కోటలోపల నిర్మించబడటం వల్ల ఖిల్లా రామాలయంగా పేరు గాంచింది. ఇక్కడి శిల్ప కళా విధానమును బట్టి ఈ గ్రామం పేరు డిచ్‌పెల్లి అనే పేరు వచ్చిందని, దీక్షాపెల్లి డిచ్‌పెల్లిగా మారిందని కూడా చెప్తారు. శ్రీరామ చంద్రుడు లంకకు వెళ్లే ముందు ఒక రోజు ఇక్కడ ఉన్నాడని స్థలపురాణం. సంతానం లేని గాదివాడ చిన్నయ్య అనే భక్తుడు సీతారామచంద్రుని అనుగ్రహంతో సంతానం పొంది ఎంతో భక్తితో ఈ దేవాలయాన్ని పునరుద్దరణ చేశాడని చరిత్ర. రాజస్థాన్ నుండి తెచ్చిన దివ్య సుందరమైన పాలరాతి సీతారామ లక్ష్మణుల మూల మూర్తులు ఇక్కడ దర్శనం ఇస్తాయి.

వందల సంవత్సరాల చరిత్ర గల ఈ దేవాలయాన్ని ఎందరో పర్యాటకులు సందర్శిస్తారు. అందుకే ప్రభుత్వం



చొరవ తీసుకొని పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయాలని ఇక్కడి వారి కోరిక. ఇక్కడ మాఘ మాసంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, శ్రీరామ నవమి. వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.



**సేకరణ : బూస సుదర్శన్**

అత్యంత సుందరమైన శిల్పకళతో తీర్చిదిద్ది ఈ ఆలయాన్ని నిర్మించారు. ప్రత్యేక చరిత్రగలదీ దేవాలయం. అక్కడి గ్రామస్థులు, చైర్మన్ జంగం శాంతయ్య, మాజీ సర్పంచ్ బూస సుదర్శన్, మొదలగు గ్రామ బాధ్యులు మరియు అర్చకులు సుమిత్ శర్మ దేశ్ పాండే గారు ఈ నిర్వహణలో ఎంతో శ్రద్ధ వహిస్తారు. గ్రామస్థుల సమైక్య కార్యాచరణతో అభివృద్ధి పనులు జరుగుతాయి. దేవాలయాన్ని సందర్శకులకు ఆకర్షణీయంగా సుందరంగా ఏర్పాటు చేయుటకు ఇక్కడి యం.యల్.ఎ భూపతిరెడ్డి గారి చొరవతో ఎండోమెంట్, టూరిజం శాఖలు సమిష్టి కార్యాచరణతో అభివృద్ధి చేయడానికి ముందుకు వస్తున్నారు. ఈ దేవాలయం నిజాంబాద్ కు 16 కిలోమీటర్ల దూరంలో హైవేకు దగ్గరలో భక్తుల సందర్శనకు అనువుగా ఉంది.

ఎత్తయిన కోటలో నిర్మించిన ఈ ఆలయాన్ని వందకు పైగా మెట్లెక్కితే చేరుకోగలం. పైనుండి డిచ్‌పెల్లి గ్రామం అందంగా కనిపిస్తుంది. దేవాలయం లోపల నిజామాబాద్ వరకు సొరంగ మార్గాలున్నాయని చెబుతారు. భక్తుల కోరికలు ఈడేర్చు దైవ సన్నిధి, మరియు వారసత్వ శిల్ప సంపద గల ఖిల్లా రామాలయాన్ని దర్శించి తరిద్దాం! ★



జెమ్స్ ఆఫ్ వేదిక్ విస్‌డమ్-గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమంలో



**తిరువాయ్‌మొళి సూత్త్నాది గ్రంథావిష్కరణ**

శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయము, సైదాబాద్‌కాలనీ లో శ్రీమాన్ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు గారిచే ప్రతిపదార్థ వాఖ్యానముతో తెనిగించబడిన గ్రంథావిష్కరణ జరిగింది.



శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్య తిరునక్షత్రోత్సవ ప్రయుక్త 20వ స్మారక పురస్కార ప్రదానము-2024 కార్యక్రమంలో ఉత్తమ సంస్కృత పండిత పురస్కారము ఉ.వే.ప్ర శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్య స్వామి వారికి ప్రదానము, శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ముఖ్యాతిథిగా ఉ.వే.ప్ర. శ్రీమాన్ డా.యస్.వి. రంగరామానుజాచార్య స్వామి విశిష్టాతిథిగా ఈ కార్యక్రమం 17 నవంబర్ న హైదరాబాద్‌లో ఎంతో వైభవంగా జరిగింది.



భద్రాచలం దివ్య క్షేత్రంలో 24-11-24 నాడు డా॥ చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ గారి సంస్కృతిసభ కార్యక్రమంలో అధర్వణ వేద పండితులు, ఉభయ వేదాన్త విద్వద్వరేణ్యులు, వాక్సుధాపయోనిధి శ్రీమాన్ గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్య స్వామివారు "భద్రభారతి" పురస్కారాన్ని అందుకున్న శుభసందర్భం.



నిజామాబాద్ జిల్లా ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో "శ్రీవెంకటేశ్వర స్వామి" వారి వార్షిక "పవిత్రోత్సవములు" నవంబర్ 12 నుండి జరిగాయి.





కరీంనగర్ వేదభవనంలో కార్తీకమాసం సందర్భంగా నవంబర్ 30వ తేదీన శ్రీలక్ష్మీనారాయణ కళ్యాణ మహోత్సవం, దీపోత్సవము అత్యంత వైభవంగా జరిగాయి



# బాలవిజ్ఞానం

# మాట నేర్పు

శ్రీమతి విజయ కందాళ



ఒకరోజు పిల్లలంతా కథ చెప్పమని తాతయ్య వెంటపడ్డారు. అయితే నువ్వు చెప్పే కథ మాకు జీవితంలో ఉపయోగపడేలా ఉండాలని ఒక షరతు కూడా పెట్టారు.

సంతోషంగా తాతయ్య ఒప్పుకున్నాడు కథను మొదలుపెట్టాడు

అనగా అనగా ఒక దేశానికి ఒక రాజు ఉండేవాడు. ఆయన ఒకరోజు క్రూర మృగాలను సంహరించడానికి కొద్దిమంది పరివారంతో కలిసి వేటకు అడవికి వెళ్ళాడు. అయితే ఒక సింహం రాజుకు అందకుండా దూరంగా వెళ్ళింది. దాన్ని తరుముకుంటూ రాజు కూడా చాలా దూరం వెళ్ళ వలసి వచ్చింది.

అలా సింహాన్ని చంపే ప్రయత్నంలో రాజు దారి తప్పాడు. ఎంత వెతికినా వెంట వచ్చిన పరివారం గురించి తెలుసుకోలేకపోయాడు, వారిని కలుసుకోలేకపోయాడు. చాలాసేపు వెతికాక, అతనికి ఒక చిన్న గుడిసె కనిపించింది. దాని ముందు తపస్సు చేసుకుంటున్న ఒక సాధువు కనిపించాడు. అయితే అతనికి కళ్ళు లేవు.


ఆ సాధువు దగ్గరికి వెళ్లి, రాజు 'ఈ దారి వెంట ఎవరైనా వెళ్లారా సాధు మహారాజ్' అని అడిగాడు.

దానికి ఆ సాధువు నవ్వుతూ 'ఈ దారి వెంట మొదట మీ సేవకుడు అందరికంటే ముందుగా వెళ్ళాడు. అతని వెనుక మీసేనా నాయకుడు వెళ్లాడు. ఆ తరువాత అంటే ఇంతకు ముందే మీ మంత్రి ఈ దారిలోనే వెళ్ళాడు మహారాజా' అన్నాడు.

దృష్టి లేని ఆ సాధువు మాటలకు రాజు చాలా ఆశ్చర్యపోయాడు. 'ఈ దారి వెంట ముగ్గురు మనుషులు వెళ్లారు అని చెప్పకుండా సేవకుడు, సేనా నాయకుడు, మంత్రి వెళ్ళారని చెబుతున్నారు. పైగా నేను చెప్పకుండానే మహారాజునని కూడా తెలుసుకున్నారు. ఈ విషయాలను మీరు ఎలా గ్రహించారు?' అని సాధువును అడిగాడు.


'రాజా నువ్వు అన్న మాట నిజమే నాకు ఏమీ కనిపించదు. కానీ మీ నలుగురిని మాటలను బట్టి తెలుసుకోగలిగాను. మొదట మీ సేవకుడు ఈ దారిలోనే వచ్చి ఏమిరా గుడ్డివాడ ఇటు ఎవరైనా వచ్చారా?' అని అడిగాడు. కాసేపయ్యాక సేనా నాయకుడు వచ్చి 'ఈ దారిలో ఎవరైనా వెళ్లారా అండి అని అడిగాడు. చివరగా మీ మంత్రి వచ్చి సాధువు గారు! ఈ దారిలో ఎవరైనా బాటసారి వెళ్లడం మీరు గమనించారా అని అడిగాడు. మీరొచ్చి సాధు మహారాజ్ ఈ దారిలో ఎవరైనా వెళ్లారా అని అడిగారు. ఇలా మీ మాటల్లో తేడాను బట్టి మీరు ఎవరో కనుక్కోగలిగాను. ఎవరి వ్యక్తిత్వాన్ని అయినా సంస్కారాన్ని అయినా అతని మాటలతోనే తెలుసుకోగలం. మన మాటలే మనకు మిత్రువుల్ని, శత్రువుల్ని సంపాదించి పెడతాయి' అని రాజుతో సాధువు చెప్పాడు.

తాతయ్య పిల్లలతో ఈ కథ చెప్పి ఇంకా ఇలా అన్నాడు. తల విలువ నోరు చెబుతుంది. మన విలువ హోదాను బట్టి కాదు. మన మాట తీరును బట్టి మనం ఏంటో ఎదుటివారికి తెలిసిపోతుంది. కాబట్టి ఎవరితో మాట్లాడినా సరళంగా, మర్యాదగా, మృదువుగా మాట్లాడండి! అందరూ మిమ్మల్ని అభిమానిస్తారు గౌరవిస్తారు అని కథను ముగించాడు తాతయ్య. ★



**PRAPATTI SRISANNIDHANAM** Telugu Monthly **DEC 2024** **RNI NO : TELTEL/2024/89280**
**Publication Date 1st of Every Month, Posted at Karimnagar, DOP : Every month 5th / 6th**

# శ్రీసన్నిధి పదకేళి 10




**అడ్డం**

1.కవికృష్ణమాచార్యుల నవంబర్ వ్యాసం (6)
2.ధృవుడు ప్రయోగించిన అస్త్రం. (6)
3.దీపావళి తరువాత రెండవరోజు (5)
7.ప్రహ్లాదుడి తల్లి (4)

**నిలువు**

4.మేనక విశ్వామిత్రుల కుమార్తె (4)
5.కంచి పెరుమాళ్ళు (7)
6.తులసీ ద్రావిడ నామం (5)
8.యజ్ఞమూర్తి అను పండితుడు ఏ ప్రాంతానికి చెందినవాడు.4)
9.ధర్మో రక్షతి ...... (3)
10.నక్షత్రాలలో చివరిది (3)
11.ధాత్రి ? (3)
12.సూర్యుడు అధిదేవత గల తిథి (3)
13.దామ ? (2)

**శ్రీసన్నిధి పదకేళి (9) సమాధానాలు**

1.తొమ్మిదిరోజులు, 2.సనత్కుమారులు, 3. ఆయుధపూజ 4.యోగలక్ష్మి, 5.స్వాయంభువ మనువు, 6. పొగడమాను, 7. ధనలక్ష్మి 8. మార్గశిర, 9.పాద్యమి, 10.పునర్వసు, 11. చైత్రం, 12.ఇక్ష్వాకు, 13.గంగ. సమాధానాలు పంపినవారు. శ్రీమతి జి.సువర్ణ, సిరిసిల్ల, టి.దుర్గారాణి, వైజాగ్., రాజోలు వెంకటి, హైదరాబాద్ విజేతలకు డిసెంబర్ నెల పత్రిక పంపించడం జరుగుతుంది. పదకేళిలో పాల్గొనండి! ఉచిత పత్రిక అందుకోండి!! సరియైన సమాధానాలు జవాబులు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.




From :
**PRAPATTI SRISANNIDHANAM**
Telugu Monthly
H No 10-2-225, VIDYANAGAR,
KARIMNAGAR -505 001.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI No. TELTEL/2024/89280,
Cell No : 9502583323, Land line No 0878-2253323, Email Id prapatti.srisannidhanam9@gmail.com.